విశాఖపట్టణం
శనివారం 11 జులై 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:168 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## రిజిస్ట్రేషన్స్ అదనపు ఐజీ బాలకృష్ణకు

# ఐఏఎస్ పదోన్నతి



**విశాఖపట్నం, జూలై 10, జయ జయహే బ్యూరో :**

విశాఖపట్నం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ గుడిస బాలకృష్ణకు ఐఏఎస్‌గా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో గ్రూపు -1 అధికారిగా చేరిన ఆయన వివిధ హోదాలతో పాటు కీలక బాధ్యతలను నిర్వహించారు. అల్లూరి పాడేరు జిల్లాకు చెందిన ఈయనకు ఐఏఎస్ లభించడంపై మన్యం వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. ఐఏఎస్ 2024 ఎంపిక ద్వారా ఏపీ నాన్ స్టేట్ సివిల్ సర్వీస్ కు చెందిన అధికారులుగా వీరికి పదోన్నతి లభించింది.



# ఏపీకి రండి..!

### నవంబర్‌లో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్

### విస్తృత అవకాశాలు, వేగవంత అనుమతులు

### కొరియాలో పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ పిలుపు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

గ్లోబల్ ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చే లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటన 6వ రోజూ అత్యంత విజయవంతంగా సాగింది. సియోల్ వేదికగా ప్రముఖ కొరియన్ దిగ్గజ సంస్థలతో వరుస భేటీలు అవుతూ రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షిశీచారు. ఎలక్ట్రానిక్స్, ఈవీ రంగాలు, గ్రీన్ ఎనర్జీ, షిప్‌బిల్డింగ్ రంగాల్లో ఏపీకి ఉన్న వ్యూహాత్మక అనుకూలతలను వివరిస్తూ సరికొత్త ప్రతిపాదనలను కంపెనీల ముందుంచారు. లోకేశ్ పారిశ్రామిక విజన్‌కు ఆకర్షితులైన కొరియా పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు, కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు సంపూర్ణ సుముఖత వ్యక్తం చేశారు. దక్షిణ కొరియా పర్యటన 6వ రోజు పర్యటనలో భాగంగా గృహోపకరణాల దిగ్గజం 'కుకూ ఎలక్ట్రానిక్స్' ఓవర్సీస్ హెచ్‌ఓడీ చో హన్ చుల్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. దేశంలో తయారయ్యే ఏసీల్లో 40 శాతం, టీవీల్లో 35 శాతం ఏపీలోనే ఉత్పత్తి అవుతున్నాయని వివరించిన మంత్రి శ్రీసిటీ లేదా తిరుపతిలో కుకూ సంస్థ తమ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కుకూ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ..మిగతా 2లో

# సోషల్ మీడియాపై ఉక్కుపాదం

### వ్యక్తిగత దూషణలపై కఠిన చర్యలు

### ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తే సహించం


### సమాజంలో అశాంతిని రేపితే ఉపేక్షించం

### డిజిటల్‌గా ప్రక్షాళన చేస్తాం

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే శిక్షిస్తాం

### కేబినెట్‌లో సీఎం చంద్రబాబుతో మంత్రుల చర్చ





**(అమరావతి - జయజయహే)**

భావప్రకటన స్వేచ్ఛ ముసుగులో సోషల్ మీడియా వేదికగా చెలరేగిపోతూ, అడ్డగోలు ట్రోలింగ్‌కు పాల్పడుతున్న వికృత మనస్తత్వాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై అత్యంత సీరియస్ చర్చ జరిగింది. సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేసే వారిపై, వ్యక్తిగత దూషణలకు దిగే వారిపై చట్టపరమైన చర్యలను వేగవంతం చేసేందుకు , పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక టాస్క్‌ఫోర్స్ నియమించాలని కేబినెట్ నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తూ, సమాజంలో అశాంతి రేపుతున్న వారిని ఇకపై ఏమాత్రం ఉపేక్షించేది లేదని ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర పోలీస్ బాస్ సోషల్ మీడియా అక్రమాలపై ఒక సమగ్రమైన ప్రత్యేక నివేదికను మంత్రివర్గం ముందు ఉంచారు. ఇటీవల అరెస్ట్ అయిన ప్రశ్న ఛానెల్ నిర్వాహకుడు జోసఫ్ రావణ్‌తో పాటు మరికొందరు వ్యక్తులు, గ్రూపులు పనిగట్టుకుని ప్రభుత్వంపై తప్పుడు, అబద్ధపు ప్రచారాలు చేస్తున్న తీరును నివేదికలో ఆధారాలతో సహా పొందుపరిచారు. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా.. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అత్యంత వ్యూహాత్మకంగా విద్వేషాన్ని నూరిపోస్తున్నారని ..మిగతా 2లో

# అయోధ్య అక్రమాలపై 31న విచారణ

### శ్రీరామ విరాళాల అవినీతిపై సుప్రీంలో పిటీషన్.. స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్



**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

అయోధ్యలోని ప్రతిష్ఠాత్మక శ్రీరామ మందిరంలో విరాళాల లెక్కింపులో జరిగినట్లు చెప్తున్న అక్రమాల వ్యవహారం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానానికి చేరింది. ఈ విరాళాల చోరీపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు జూలై 13 న విచారించనుంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరపనుంది. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ నరేంద్ర కుమార్ గోస్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయోధ్య రామాలయ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఆర్థిక లావాదేవీలపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తో ఆడిటింగ్ చేయించాలని ఆయన కోరారు. ఇదే అంశంపై అజయ్ కుమార్ రాయ్, దినేష్ కుమార్ యాదవ్ కూడా కోర్టును ఆశ్రయించారు. మరోవైపు, ఆర్‌జేడీ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు..మిగతా 2లో



# తాత్కాలిక చర్యలతో సరిపెట్టొద్దు

### దీర్ఘకాలిక పరిష్కారం చూపాలి

### పారిశ్రామిక కాలుష్యంను సహించేది లేదు

### ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధన్యత ఇవ్వాల్సిందే

### ప్రతీ వాహనంపై గ్రీన్ టార్పన్ తో క్లోజ్ చేయాలి

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పిలుపు

### కాలుష్యంపై పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష

3

## నేడు మహేంద్రగిరి

# జల ప్రవేశం

### హాజరుకానున్న రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్

### స్వదేశీ పరిజ్ఞానం, స్వావలంబనతో నిర్మాణం

**(విశాఖఫట్నం - జయజయహే)**

ప్రాజెక్ట్ 17ఏలో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఆరవ స్టెల్త్ ఫ్రిగేట్ అయిన మహేంద్రగిరి ని 2026 జూలై 11న విశాఖలో తూర్పు నౌకాదళంలోకి ప్రవేశపెట్టడానికి భారత నౌకాదళం సిద్ధంగా ఉంది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరగనున్న ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం, రక్షణలో స్వావలంబన, స్వదేశీ యుద్ధనౌకల నిర్మాణం దిశగా భారతదేశం సాగిస్తున్న ప్రయాణంలో మరో మైలురాయిగా నిలుస్తుంది. భారత నౌకాదళానికి చెందిన యుద్ధ నౌక రూపకల్పన బ్యూరో అంతర్గతంగా రూపొందించి, ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించిన ..మిగతా 2లో



## న్యాయాధికారి గారూ..

# నా ఆదేశాలు పాటించండి

### సుప్రీంకోర్టులో సంచలన ఘటన

### చీఫ్ జస్టిస్‌పై పత్రాలను విసిరికొట్టిన పిటీషనర్

### పిటీషనర్ మమ్మల్ని ఆజ్ఞాపిస్తారా అంటూ ధర్మాసనం ఆగ్రహం

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**



భారత అత్యున్నత న్యాయస్థానం చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒక అనూహ్య, షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఒక ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుగుతుండగా.. కోర్టుకు స్వయంగా హాజరైన ఒక పిటిషనర్ తీవ్ర ఆగ్రహంతో ధర్మాసనంపైకే కేసు పత్రాలను విసిరేసి, న్యాయమూర్తులను దుర్భాషలాడాడు. జూలై 10జరిగిన ఈ ఘటన సుప్రీంకోర్టు ప్రాంగణంలో తీవ్ర కలకలం రేపింది. న్యాయమూర్తులు జస్టిస్ కె.వి. విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం ఎదుట ఈ కేసు విచారణకు వచ్చింది. లాయర్ లేకుండా

## రావణ్ కేసు

# వాదనకు పొన్నవోలు

### వైసీపీకి సంబంధం లేదని వివరణ

### యూట్యూబర్ నివాసంలో రెండో రోజు సోదాలు



2

# విశాఖలో స్నాతకోత్సవమా..?

### తొలి స్నాతకోత్సవం విజయనగరంలోనే నిర్వహించాలి

### గవర్నర్‌కు మండలి విపక్షనేత బొత్స లేఖ

### నేడు విశాఖలో జేఎన్ టీయూ జీవీ స్నాతకోత్సవం

**(విజయనగరం - జయజయహే)**

జేఎన్‌టీయూ (గురజాడ-- విజయనగరం) తొలి స్నాతకోత్సవాన్ని విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించాలన్న నిర్ణయంపై శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో వెనకబడిన ప్రాంతమైన విజయ నగరంలో ..మిగతా 2లో



3

# సోషల్ మీడియాపై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి...



డీజీపీ నివేదికలో పేర్కొనడం కేబినెట్‌లో తీవ్ర కలకలం రేపింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై నిరంతరం నోటి విరోచనాలు చేసుకునే ఇటువంటి మానసిక రోగులకు చట్టం పవర్ చూపించాల్సిందేనని మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చారు. సోషల్ మీడియా నేరగాళ్లపై నమోదవుతున్న కేసులను కోర్టుల్లో బలంగా వాదించడానికి, నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చేయడానికి అవసరమైతే ప్రత్యేకంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సైబర్ క్రైమ్ చట్టాలను మరింత కఠినంగా అమలు చేస్తూ, ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో విచారణ జరిపించేలా న్యాయపరమైన మౌలిక వసతులను బలోపేతం చేయాలని ఐటీ, హోంశాఖ అధికారులను సీఎం ఆదేశించారు.

**సెలబ్రిటీ పిచ్చికి షాక్ ట్రీట్‌మెంట్**

అరెస్ట్ అయితే పబ్లిసిటీ వస్తుందనే చీప్ పాపులారిటీ పిచ్చితో రెచ్చిపోతున్న వారికి ఈ టాస్క్‌ఫోర్స్ చర్యలు ఒక గట్టి షాక్ ట్రీట్‌మెంట్ కానున్నాయి. ఒకసారి తప్పు చేస్తే మళ్లీ జీవితంలో సోషల్ మీడియా వైపు చూడాలన్నా భయపడేలా జైలు శిక్షలు, భారీ జరిమానాలు పడేలా లీగల్ యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది. ప్రశ్నించే హక్కు ఎవరికైనా ఉంటుందని, అయితే కుటుంబాలను రోడ్డుకు ఈడ్చడం, మతపరమైన విద్వేషాలు రేపడం వాక్ స్వేచ్ఛ కిందికి రాదనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఫేక్ ఐడీల వెనుక దాక్కుని వికృతానందం పొందే సోషల్ మీడియా సైకోల ఐపీ అడ్రస్‌లను ట్రాక్ చేసి మరీ పట్టుకునేలా సరికొత్త సాంకేతికతను ఈ టాస్క్‌ఫోర్స్‌కు అనుసంధానించనున్నారు.

**డిజిటల్ ప్రక్షాళన**

గత ఐదేళ్లుగా సోషల్ మీడియాను వేదికగా చేసుకుని సాగిన బూతుల సంస్కృతికి, మార్ఫింగ్ దందాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో మైలురాయిగా మారనుంది. వ్యవస్థలను, కుటుంబాలను టార్గెట్ చేస్తూ పెచ్చరిల్లిపోతున్న డిజిటల్ అరాచకత్వాన్ని తుడిచిపెట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగుతుండటంతో.. త్వరలోనే క్షేత్రస్థాయిలో దీని ఫలితాలు కనిపించనున్నాయి. సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని, సోషల్ మీడియాలో పద్ధతిగా ప్రశ్నించే సంస్కృతిని కాపాడేందుకు ఈ డిజిటల్ ప్రక్షాళన ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నారు.



# అయోధ్య అక్రమాలపై 31న విచారణ

మొదటి పేజీ తరువాయి...

చేసిన పిటిషన్‌లో.. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు జరపాలని, ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై సమగ్ర ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆధారాలు కనుమరుగు కాకుండా ఉండేందుకు డిజిటల్ లెడ్జర్లు, యూపీఐ లావాదేవీల రికార్డులు, బ్యాంక్ స్టేట్‌మెంట్లతో పాటు అన్ని భౌతిక పత్రాలను భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రతిపాదిత ఓవర్‌సైట్ కమిటీ (ఉన్నత స్థాయి కమిటీ) ముందస్తు అనుమతి లేకుండా ట్రస్ట్ ఎలాంటి పెద్ద పెట్టుబడులు పెట్టకుండా, ఒప్పందాలు చేసుకోకుండా నిలువరించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. పారదర్శకత కోసం ట్రస్ట్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఆడిట్ చేసిన ఆర్థిక నివేదికలను, విరాళాల వివరాలను ఉంచాలని కోరారు. ట్రస్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి నగదు, బ్యాంక్ బదిలీలు, డిజిటల్ చెల్లింపులు, విదేశీ విరాళాలు, బంగారం, వెండి రూపంలో వచ్చిన కానుకల పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

**అసలు వివాదం ఇదీ..**

ఈ ఏడాది జూన్ మొదటి వారంలో అయోధ్య రామాలయం విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగినట్లు వెలుగు చూడటంతో ఈ వివాదం మొదలైంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసును విడిగా విచారిస్తోంది. దుర్వినియోగం చేసిన సొమ్మును నిందితులు షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టడమే కాకుండా, వడ్డీలకు తిప్పినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసు వర్గాలు తెలిపాయి. కొంత సొమ్మును నిందితులు తమ బంధువులు, సన్నిహితుల బ్యాంక్ ఖాతాలకు మళ్లించినట్లు గుర్తించారు. రామమందిర విరాళాల లెక్కింపు గదిలో తీవ్రమైన భద్రతా లోపాలు ఉన్నట్లు సిట్ విచారణలో తేలింది. లెక్కింపు సిబ్బంది డబ్బు కట్టలను తమ బట్టలు, జేబులు, షూస్‌లలో దాచుకుని తీసుకెళ్లారని, ఇది ఏదో ఒకరోజు జరిగింది కాదని, చాలా కాలంగా పద్ధతి ప్రకారం సాగుతున్నట్లు సీసీటీవీ దృశ్యాల ద్వారా స్పష్టమైంది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 మధ్య కాలానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, సిబ్బంది నగదు కట్టలను దాస్తున్న సుమారు 70 అనుమానాస్పద ఘటనలు వెలుగుచూశాయి. లెక్కింపు హాల్ లోపలికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు సిబ్బందిని తనిఖీ చేసే పటిష్టమైన భద్రతా నిబంధనలు లేకపోవడం వల్లే ఈ దొంగతనం జరిగిందని సిట్ నివేదిక స్పష్టం చేసింది. నిందితులు నకిలీ రసీదులను సృష్టించి భక్తుల నుంచి విరాళాలు వసూలు చేసినట్లు జూలై 8 నాటి పోలీసు విచారణలో తేలింది.

**అరెస్టులు.. రాజీనామాలు**

ఈ విరాళాల చోరీ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురు సభ్యుల సిట్ సమర్పించిన ప్రాథమిక నివేదిక ప్రకారం అవినాష్ శుక్లా ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా ఉన్నాడు. సుమారు 40 రోజుల పాటు సాగిన ఈ వ్యవహారంలో అతనికి సంబంధం ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఈ వివాదం నేపథ్యంలో, రామజన్మభూమి ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేశారు. ట్రస్ట్ సమావేశంలో వారి రాజీనామాలను ఆమోదించారు. “రాజీనామా చేయడంపై చంపత్ రాయ్‌కు ఎలాంటి అసంతృప్తి లేదు, ఆయన ఆరోగ్యంగానే ఉన్నారు” అని ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి పేర్కొన్నారు. మరోవైపు, నిందితులైన అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, కరుణేష్ పాండేల బంధువులకు చెందిన 30 బ్యాంక్ ఖాతాలను పోలీసులు స్తంభింపజేశారు. కోర్టు అనుమతితో ఈ ముగ్గురు నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరి ఇళ్లలో జరిపిన సోదాల్లో భారీగా నగదు కట్టలు, బంగారు ఆభరణాలు, ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**ట్రస్ట్‌కు మద్దతుగా సీఎం యోగి**

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విరాళాల లెక్కింపు వ్యవహారంలో ట్రస్ట్‌కు మద్దతుగా నిలిచారు. విరాళాల లెక్కింపులో సుమారు 150 మంది పాల్గొంటుండగా, సిట్ దర్యాప్తులో కేవలం ఎనిమిది మందిపైనే ఆధారాలు లభించాయని ఆయన స్పష్టం చేశారు. అయోధ్యలో రూ. 950 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. “విరాళాల లెక్కింపులో దొంగతనం జరుగుతున్నట్లు ట్రస్ట్ స్వయంగా ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి, ఉన్నత స్థాయి సిట్ దర్యాప్తును కోరింది. మేము ఆ సిఫార్సును అంగీకరించి దర్యాప్తు జరిపించాం. ఇందులో ఆరుగురు నేరుగా దొంగతనానికి పాల్పడగా, మరో ఇద్దరు కుట్రలో భాగస్వాములయ్యారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడు, రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు మొత్తం ట్రస్ట్‌ను, అయోధ్యను బద్నాం చేయడం ఎంతవరకు సమంజసం?” అని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రశ్నించారు. రాముడి భక్తులు, దేశ సంస్కృతిని గౌరవించే ప్రతి ఒక్కరూ ఇలాంటి విమర్శల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఏపీకి రండి..!

మొదటి పేజీ తరువాయి...

‘మోటివ్ లింక్’ సీఈవో కిమ్ కి-హాన్‌తో జరిగిన సమావేశంలో ఏపీలో ఈవీ విడిభాగాలు, ఎస్ ఎం డీ, ఇంటిగ్రేటెడ్ మాడ్యూళ్ల తయారీ ప్లాంట్‌ను పెట్టాలని లోకేశ్ కోరారు. శ్రీసిటీలో మౌలిక వసతులతో కూడిన భూమి సిద్ధంగా ఉందని, దీంతోపాటు రక్షణ రంగ సంస్థలైన స్పేస్ సిటీ, స్కైరూట్‌లలోనూ పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని కోరారు. పీసీబీ తయారీ దిగ్గజం ‘షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్’ ఛైర్మన్ టేహూ కిమ్‌తో మంత్రి భేటీ కాగా, సంస్థ ఒక భారీ ప్రకటన చేసింది. తిరుపతి జిల్లా నాయుడుపేటలో ₹1,595 కోట్లతో ఈవీ, ఆటో, హెల్త్‌కేర్ రంగాల కోసం దేశంలోనే అతిపెద్ద పీసీబీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. దీని ద్వారా ఏపీలో 2,170 మందికి ఉపాధి లభించనుంది. షిప్‌బిల్డింగ్ దిగ్గజం ‘హెచ్ డీ కోజ్ గ్లోబల్ బిజినెస్ డైరెక్టర్ క్వోన్ యంగ్వాన్‌తో లోకేశ్ సమావేశమై, ఏపీకున్న 1053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, 6 యాక్టివ్ పోర్టుల వ్యూహాత్మక అనుకూలతలను వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ విధానాలను మెచ్చుకున్న కొరియా బృందాన్ని, నేరుగా సీఎం చంద్రబాబుతో సమావేశానికి ఏపీ రావాల్సిందిగా ఆహ్వానించారు. ఎడ్జ్ ఏఐ , బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ నిపుణులైన ‘డెల్టా ఎక్స్’ సీఈవో స్టీఫెన్ కిమ్‌తో భేటీలో ఏపీ లక్ష్యమైన 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 25 గిగావాట్ల ప్రాజెక్టుల గురించి లోకేశ్ వివరించారు.రాష్ట్రంలో బ్యాటరీ స్టోరేజ్ తయారీ యూనిట్ ఏర్పాటుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని డెల్టా ఎక్స్ స్పష్టం చేసింది. కొరియా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ ఛైర్మన్ టేక్-సుంగ్ లీ నేతృత్వంలోని రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 కింద ఆర్టీసీ బస్సుల పూర్తి విద్యుదీకరణ, ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్లు, పుంగనూరు ఈవీ క్లస్టర్, రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు వంటి ప్రతిష్టాత్మక ప్రణాళికలను వివరించారు. ఆటోమొబైల్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అనంతపురం కియా క్లస్టర్ సమీపంలో ఒకటి, శ్రీసిటీ-చిత్తూరు-తిరుపతి కారిడార్‌లో మరొకటి చొప్పున రెండు ప్రత్యేక కొరియన్ ఆటో కాంపోనెంట్ పార్కులను ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో ఏర్పాటు చేస్తామని లోకేశ్ ప్రకటించారు. పెట్టుబడుల సమన్వయం కోసం ఏపీఈడీబీ లో ప్రత్యేక ‘కొరియా డెస్క్’ నిర్మిస్తున్నట్లు తెలిపారు. శాంసంగ్ ఈవీపీ యంగ్ జో యున్‌తో భేటీ అయిన లోకేశ్ ఏపీని ఏఐ-సర్వర్ తయారీ, డిస్‌ప్లే ఫ్యాబ్, ఓ ఎస్ ఏ టీ సదుపాయాలకు కేంద్రంగా మార్చాలని కోరారు. అమరావతి క్వాంటం వ్యాలీలోని ఐబీఎం క్వాంటం సిస్టమ్ టూ పరిశోధనల్లో భాగస్వామ్యం కావాలని కోరుతూ, శాంసంగ్ బహుళ విభాగాల కోసం ప్రత్యేకంగా ‘సాంసంగ్ సిటీ’ నిర్మించాలనే ప్రతిపాదనను స్క్రీన్‌పైకి తెచ్చారు. ఇన్వెస్ట్ కొరియా కమిషనర్ డాక్టర్ కిమ్ టే హ్యూంగ్‌తో భేటీలో అమరావతి లేదా విశాఖపట్నంలో ప్రత్యేక కోట్రా కార్యాలయం ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. దక్షిణ భారతదేశంలోనే మెట్రోయేతర నగరంలో రాబోయే మొదటి ఆఫీస్ ఇదే కానుంది. అలాగే నవంబర్ 12-13 తేదీల్లో ఏపీలో జరగబోయే ‘సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026’ కు కొరియన్ కంపెనీలు పెద్దఎత్తున హాజరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు మహేంద్రగిరి జల ప్రవేశం

మొదటి పేజీ తరువాయి...



మహేంద్రగిరి, భారతదేశపు అగ్రశ్రేణి స్టెల్త్ ఫ్రిగేట్‌ల సరికొత్త పరిణామానికి ప్రతీకగా నిలుస్తుంది. అధునాతన స్టెల్త్ లక్షణాలు, మెరుగైన మనుగడ సామర్థ్యం, తగ్గిన రాడార్ సిగ్నేచర్ మరియు అధిక స్థాయి ఆటోమేషన్‌ను కలిగి ఉన్న ఈ యుద్ధనౌక, నౌకాదళ యుద్ధంలోని అన్ని కోణాలలో పూర్తి స్థాయి సముద్ర కార్యకలాపాలను చేపట్టేందుకు రూపొందించారు. 75 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ నౌక, భారత ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం విజయానికి నిదర్శనంగా నిలుస్తూ, భారత నౌకా నిర్మాణ రంగం పెరుగుతున్న సామర్థ్యాన్ని చాటిచెబుతోంది. ఈ నౌక నిర్మాణంలో సూక్ష్మ,చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు, తద్వారా దేశ రక్షణ పారిశ్రామిక పునాదిని బలోపేతం చేయడం మరియు గణనీయమైన ఉపాధిని కల్పించడం. మహేంద్రగిరి నౌక, స్వదేశీ మరియు అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్లు, మరియు ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలతో కూడిన ఒక అధునాతన సముదాయాన్ని కలిగి ఉంది. ఇది గగనతల, ఉపరితల, మరియు జలాంతర్గామి వ్యతిరేక కార్యకలాపాలను సమర్థవంతంగా చేపట్టడానికి వీలు కల్పిస్తుంది. ఈ నౌక సముద్ర భద్రతా కార్యకలాపాలు, శోధన మరియు రక్షణ మిషన్లు, మానవతా సహాయం మరియు విపత్తు ఉపశమనం, హిందూ మహాసముద్ర ప్రాంతం మరియు దాని వెలుపల సుదీర్ఘకాలం పాటు మోహరించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. తూర్పు కనుమలలోని గంభీరమైన మహేంద్రగిరి పర్వత శ్రేణి పేరు మీదుగా ఈ నౌకకు ఆ పేరు పెట్టారు. ఇది బలం, స్థితిస్థాపకత మరియు అచంచలమైన సంకల్పానికి ప్రతీక. ఈ పేరును పొందిన మొట్టమొదటి భారత నావికాదళ యుద్ధనౌకగా, మహేంద్రగిరి కార్యాచరణ నైపుణ్యం మరియు జాతీయ సేవ పట్ల భారత నావికాదళం నిబద్ధతను ప్రతిబింబించే వారసత్వాన్ని ముందుకు తీసుకువెళుతోంది. ఈ నౌక ‘మిషన్ ప్రైమ్డ్’ యుద్ధ వేదికగా నౌకాదళంలో చేరడానికి పూర్తిగా సిద్ధంగా ఉంది. మహేంద్రగిరి చేరిక భారత నౌకాదళం పోరాట సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది మరియు అగ్రగామి స్వదేశీ యుద్ధనౌకల నిర్మాణ దేశంగా భారతదేశం ఆవిర్భవించడాన్ని నొక్కి చెబుతుంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ప్రాధాన్య భద్రతా భాగస్వామిగా మరియు సురక్షితమైన, స్థిరమైన, సుసంపన్నమైన ఇండో-పసిఫిక్‌కు కీలక సహకారిగా భారతదేశం తన పాత్రను పెంపొందించుకుంటూ ఉండగా, మహేంద్రగిరి దేశ సముద్ర ప్రయోజనాలను వృత్తి నైపుణ్యం, సంకల్పం మరియు నిశ్చయంతో కాపాడటానికి సిద్ధంగా ఉంది. ‘మహోన్నత-గంభీర-సాటిలేని’ అనే తన నినాదంతో, మహేంద్రగిరి దేశానికి విశిష్టంగా సేవ చేయడానికి మరియు భారత నావికాదళం ఘనమైన చరిత్రలో మరో గర్వించదగిన అధ్యాయాన్ని జోడించడానికి సిద్ధంగా ఉంది.

# రావణ్ కేసు వాదనకు పొన్నవోలు

## వైసీపీకి సంబంధం లేదని వివరణ

## యూట్యూబర్ నివాసంలో రెండో రోజు సోదాలు

**(అమరావతి - జయజయహే)**

యూట్యూబర్ రావణ్ అరెస్టు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయనపై ఉపా కేసు పెట్టడాన్ని చాలా మంది ఖండిస్తున్నారు. అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు అలా ఉన్నాయని కూటమి తరఫున వాదిస్తున్న వారు ఉన్నారు. ఇంతలో పోలీసులు ఈ కేసులో దూకుడుగా ఉన్నారు. ఇప్పటికే ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఇప్పుడు ఆయన్ని కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ కేసుల్లో రావణ్ తరఫున పొన్నవోలు సుధాకర్ వాదనలు విపిస్తున్నారు. ఈయన వైసీపీ తరఫున కేసులు వాదిస్తుంటారు. ఇప్పటికే రావణ్‌ను వెనుక ఉండి నడిపిస్తుంది వైసీపీ అనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇంతలో వారి పార్టీ లాయరే రావణ్ కేసులు టేకప్ చేయడం ఆసక్తిగా మారింది. అయితే రావణ్ కేసు వాదించడం తన వ్యక్తిగత విషయమని, వైసీపీకి సంబంధం లేదని పొన్నవోలు వివరణ ఇచ్చారు. ఉపా కేసులో రావణ్‌ను కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ వేశారు. రావణ్‌ను 10 రోజులు కస్టడీకి ఇవ్వాలని గన్నవరం పోలీసులు రిక్వస్ట్ చేశారు. పోలీసులు పిటిషన్‌పై గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. రావణ్ తరఫున వాదించనున్న పొన్నవోలు సుధాకర్ రెడ్డి పోలీసులు తీరును తప్పు పట్టారు. అయితే ప్రభుత్వ న్యాయవాది రాకపోవడంతో కేసు విచారణ మంగళవారానికి వాయిదా పడింది. కోర్టు విచారణ తర్వాత రావణ్ తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రావణ్‌పై ఉపా కేసు పెట్టడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. “పోలీసులు 10 రోజులు కస్టడీ కోరుతూ పిటిషన్ వేశారు. రావణ్ తరఫున వాదనలు వినిపించేందుకు వచ్చాను. పీపీ రాకపోవడంతో మంగళ వారానికి వాయిదా వేశారు. రావణ్‌కు వైసీపీ ఎటువంటి సంబంధం లేదు. రావణ్ పై అక్రమ కేసులు బనాయించారు కాబట్టి అతనికి అండగా నిలుస్తున్నాం. రావణ్ పై ఉపా అంటే రాజహింస కాదా? పోలీసులు రావణ్ ఇంటికి వెళ్లి బియ్యం డబ్బాలు కూడా సోదాలు చెయ్యడం ఏంటి? ఈ ప్రభుత్వం ఎవరినో మెప్పించేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతుంది. రావణ్ కేసు వాదించడానికి చాపర్ ఫ్లైట్‌లో సిద్దార్థ లూద్రా లాంటి లాయర్‌ని పెట్టే పరిస్థితి లేదు. సామాన్య లాయర్ ని కాబట్టి సామాన్యుల తరుపున వాదించడానికి వచ్చాను. మంగళవారం మళ్ళీ వచ్చి రావణ్ తరఫున వదిస్తా” అని తెలిపారు. మరోవైపు వైసీపీ నేత , మాజీ మంత్రి అంబటి రాంబాబు కూడా రావణ్ తరఫున మాట్లాడారు. విజయవాడలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో అంబటి మాట్లాడారు. రావణ్‌కు తమ పార్టీకి సంబంధం లేదని చెప్పారు. అయినా సరే ఒక వ్యక్తిగా ఆయనపై ఉపా లాంటి చట్టం పెట్టడాన్ని తాము తప్పుపడుతున్నామని అన్నారు. ఇవాళ ప్రశ్నించకపోతే రేపు తమ వరకు వస్తారని అభిప్రాయపడ్డారు. అందుకే ప్రశ్నిస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే రావణ్ వెనుక వైసీపీ ఉందని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. దీన్ని వైసీపీ నేతలు, మాజీ మంత్రులు కొడాలి నాని, పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డిసహా చాలా మంది నేతలు ఖండించారు. రాష్ట్రంలో జరిగే ప్రతి అంశాన్ని జగన్‌కు, వైసీపీకి ముడిపెట్టడం కూటమి నేతలకు అలవాటుగా మారిందని అన్నారు. కానీ రావణ్‌కు వైసీపీకి సంబంధం లేదంటూనే వైసీపీ కేసులు వాదించే లాయర్ పొన్నవోలు వకాల్తా పుచ్చుకుంటే, మరో నేత రౌండ్‌టేబుల్ సమావేశంలో రావణ్ తరఫున వాదనలు వినిపించారు. దీన్నే టీడీపీ, జనసేన హైలైట్స్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు.

# విశాఖలో స్నాతకోత్సవమా..?

మొదటి పేజీ తరువాయి...

జెఎన్‌టీయూ (జీవీ) ఉన్నందువల్ల, అక్కడే తొలి స్నాతకోత్సవం నిర్వహించాలని ఆయన కోరారు. అందువల్ల జెఎన్‌టీయూ (జీవీ) తొలి స్నాతకోత్సవ వేదికపై తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గవర్నర్‌కు లేఖ రాసిన బొత్స సత్యనారాయణ, విజయనగరం వంటి వెనుకబడిన జిల్లాలోని విద్యార్థుల ఉన్నత విద్య అవసరాలను తీర్చేందుకు జేఎన్‌టీయూ (జీవీ) ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అలాంటి విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో నిర్వహించాల్సింది పోయి విశాఖపట్నంలో నిర్వహించడం సముచితం కాదని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో, మరో కొద్ది నెలల్లో శాశ్వత ప్రాంగణం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నప్పుడు ఇంత తొందరపడి విశాఖలో స్నాతకోత్సవాన్ని నిర్వహించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. జెఎన్‌టీయూ (జీవీ) తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరం వెలుపల నిర్వహించడం వల్ల జిల్లా ప్రజలు తమ విశ్వవిద్యాలయానికి సంబంధించిన చారిత్రాత్మక ఘట్టాన్ని కోల్పోతున్నారని, వారి గౌరవం, ఆనందానికి భంగం కలుగుతోందని బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంపై విజయనగరం జిల్లాలో అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరసనలు వ్యక్తమవుతున్నాయని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటన్నింటి నేపథ్యంలో, విజయనగరం ప్రజల భావోద్వేగాలు, అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని జెఎన్‌టీయూ (జీవీ) తొలి స్నాతకోత్సవ వేదికపై తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ తన లేఖలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేశారు.

# న్యాయాధికారి గారూ.. నా ఆదేశాలు పాటించండి

మొదటి పేజీ తరువాయి...

స్వయంగా వాదనలు వినిపించడానికి వచ్చిన సదరు పిటిషనర్, ప్రారంభం నుంచే తీవ్ర దూకుడు ధోరణి ప్రదర్శించాడు. న్యాయమూర్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. “న్యాయాధికారి గారూ, లక్నో ఏసీపీపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మిమ్మల్ని ఆదేశిస్తున్నాను” అంటూ అసాధారణ వ్యాఖ్యలు చేశాడు. కోర్టు గదిలో ఒక పిటిషనర్ ఇలాంటి పదజాలం వాడటంతో జస్టిస్ విశ్వనాథన్ తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యారు. “మీరు మమ్మల్నే ఆజ్ఞాపిస్తున్నారా?” అని సదరు వ్యక్తిని ప్రశ్నించారు. దానికి ఆ వ్యక్తి ఏమాత్రం తగ్గకుండా.. “నా వైపు నుంచి ఇంతే.. ప్రతిదీ రికార్డులో ఉంది” అని సమాధానమిచ్చాడు. లీగల్ వెబ్‌సైట్ ‘లైవ్ లా’ కథనం ప్రకారం.. న్యాయమూర్తి ప్రశ్నించిన కొద్దిసేపటికే సదరు పిటిషనర్ ఒక్కసారిగా సహనం కోల్పోయాడు. తన చేతిలో ఉన్న కేసు పత్రాలను చింపి, కోర్టు గదిలో గాలిలోకి, ధర్మాసనం వైపు విసిరేశాడు. అంతటితో ఆగకుండా దేశ ప్రధాన న్యాయమూర్తిని , ధర్మాసనాన్ని ఉద్దేశించి తీవ్రమైన దుర్భాషలాడుతూ.. బూతులు తిడుతూ రచ్చ చేశాడు. దీంతో కోర్టు హాల్‌లోని న్యాయవాదులు, సిబ్బంది అంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కోర్టు గదిలో ఉద్రిక్తత పెరగడంతో అక్కడే ఉన్న సుప్రీంకోర్టు భద్రతా సిబ్బంది వెంటనే అలర్ట్ అయ్యారు. సదరు పిటిషనర్‌ను బలాత్కారంగా పట్టుకుని, కోర్టు గదిలో నుంచి బయటకు ఈడ్చుకెళ్లారు. ఆ తర్వాత కోర్టులో శాంతిభద్రతలను పునరుద్ధరించారు. ఈ హైడ్రామా అంతా జరుగుతున్నంత సేపు ధర్మాసనం ఎంతో సంయమనం పాటించింది. ఆ వ్యక్తి ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైనప్పటికీ, న్యాయమూర్తులు ప్రశాంతంగానే ఉన్నారు. సదరు వివాదాస్పద పిటిషనర్ వివరాలు, అలాగే కోర్టు ధిక్కరణ కింద అతడిపై తీసుకోబోయే తదుపరి చట్టపరమైన చర్యల గురించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# విలువైన భూమి కబ్జా... చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

**నర్సీపట్నం - జయ జయహే :**

కోట్లాది రూపాయలతో నర్సీపట్నం ప్రాంతాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభివృద్ధి పరుగులు పెట్టిస్తుంటే. చోటా మోటా చిల్లర నాయకులు నియోజకవర్గానికి చెడ్డ పేరు తీసుకొస్తూ విలువైన ప్రభుత్వ భూములను కబ్జాకు పాల్పడుతున్నారు. నర్సీపట్నం నడి బొడ్డున అల్లూరి సీతారామరాజు సెంటర్ కు ఆనుకుని చెరువు పంట కాలువపై కబ్జాకు గురవుతుంటే పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూడడం పట్ల సర్వత్ర విమర్శలకు తావుతీస్తుంది. ప్రధాన రహదారి పక్కనే దర్జాగా ఆక్రమించుకుని షాపు నిర్మాణం చేపడుతుంటే అధికారుల మౌనం దేనికి నిదర్శనమని పలువురు ప్రశ్నిస్తున్నారు. చెరువు పంట కాలువను ఆక్రమించి దర్జాగా షాపు నిర్మాణం చేపట్టిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. స్థానికుల సమాచారం ప్రకారం, గతంలో ఇదే ప్రాంతంలో 123 టివి వరహాలు (పిల్లర్లు) ఏర్పాటు చేయడానికి ప్రయత్నించగా ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే తొలగించారు. అయితే అదే స్థలంలో ఇప్పుడు భారీగా నిర్మాణం చేపట్టి, షాపు నిర్మించి హోటల్ నిర్వహిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.





గతంలో ఆక్రమణ అయితే ఇప్పుడు ఎలా చట్టబద్ధమైంది.? ఎవరి అనుమతులతో నిర్మాణం పనులు జరుగుతున్నాయి.? ఈ ఆక్రమణపై ఇరిగేషన్, రెవెన్యూ , మున్సిపల్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రజలు ఆక్రోసం వెళ్లబుచ్చుకుంటున్నారు. ఒకవైపు శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి , చెరువులు, పంట కాలువలను పరిరక్షించేందుకు సిమెంట్ లైనింగ్ వంటి అభివృద్ధి పనులు చేపడుతుండగా, మరోవైపు ప్రభుత్వ భూములు, చెరువు కాలువలపై బహిరంగంగా కబ్జాలు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తుంది . వెంటనే ఈ నిర్మాణంపై విచారణ జరిపి, అక్రమమని తేలితే నిర్మాణాన్ని తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కబ్జాపై అధికారులు చర్యలు తీసుకుంటారా? లేక చూస్తూ ఊరుకుంటారా? అనే ప్రశ్నకు సమాధానం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# తాత్కాలిక చర్యలతో సరిపెట్టొద్దు

**దీర్ఘకాలిక పరిష్కారం చూపాలి**

**పారిశ్రామిక కాలుష్యంను సహించేది లేదు**

**ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందే**

**ప్రతీ వాహనంపై గ్రీన్ టార్పన్ తో క్లోజ్ చేయాలి**

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పిలుపు**

**కాలుష్యంపై పరిశ్రమల ప్రతినిధులతో కీలస సమీక్ష**

**(విశాఖపట్నం - జయజయహే)**

విశాఖపట్నం పారిశ్రామిక నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణతో పాటు కాలుష్య నియంత్రణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన పరిశ్రమల సమీక్ష సమావేశంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, గణబాబు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, విశాఖలోని 18 ప్రధాన పరిశ్రమల ప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల నుంచి బొగ్గు ధూళి, పారిశ్రామిక కాలుష్యంపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను సమావేశంలో సవివరంగా చర్చించామని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాన బాధ్యతగా ప్రతి సంస్థ భావించాలని స్పష్టం చేశారు. కేవలం తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారాల దిశగా పరిశ్రమలు అడుగులు వేయాలని పల్లా సూచించారు. బొగ్గు నిల్వలపై టార్పాలిన్లు కప్పడం ఒక్కటే పరిష్కారం కాదని, తరచూ వాటిని తొలగించడం, మళ్లీ కప్పడం వల్ల అవి దెబ్బతినడంతో ఆశించిన ఫలితం ఉండదని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. అందుకే ప్రతి పరిశ్రమ తన విస్తీర్ణానికి అనుగుణంగా విస్తృతంగా హరితవనాలను అభివృద్ధి చేయడంతో పాటు, కనీసం 20 అడుగుల ఎత్తులో రక్షణ గోడలు నిర్మించి దుమ్ము, బొగ్గు కణాలు బయటకు వ్యాపించకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని సూచించినట్లు వెల్లడించారు. బొగ్గు రవాణాలోనూ నిబంధనలు కచ్చితంగా అమలు కావాల్సిన అవసరం ఉందని పల్లా అన్నారు. లారీలు గరిష్ఠ లోడ్ సామర్థ్యానికి మించి బొగ్గు తరలించరాదని, అధిక లోడింగ్ వల్ల రోడ్లపై బొగ్గు చెల్లాచెదురై కాలుష్యంతో పాటు ప్రమాదాలకు కూడా కారణమవుతోందన్నారు. ప్రతి వాహనంపై తప్పనిసరిగా గ్రీన్ టార్పాలిన్ కప్పి రవాణా చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కాలుష్య నియంత్రణ విషయంలో పరిశ్రమలు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు భంగం కలిగించే పరిస్థితులు ఎట్టి పరిస్థితుల్లోనూ పునరావృతం కాకూడదని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అభివృద్ధి, ఉపాధి కల్పన ఎంత ముఖ్యమో, స్వచ్ఛమైన వాతావరణం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు పరిశ్రమల ప్రతినిధులకు కాలుష్య నియంత్రణకు సంబంధించిన పలు మార్గదర్శకాలు జారీ చేయగా, వాటిని నిర్దిష్ట గడువులో అమలు చేయాలని ఆదేశించారు. విశాఖను పారిశ్రామికంగా అగ్రగామిగా తీర్చిదిద్దడంతో పాటు కాలుష్యరహిత నగరంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.




# వెండి పతక విజేత దాక్షిణ్యను అభినందించిన మంత్రి మండిపల్లి

**మరిన్ని పతకాలు సాధించాలని సూచన**

**విశాఖపట్నం, జూలై 10, జయ జయహే**



ఇటీవల గోవాలో జరిగిన 8వ బ్రాండీ ఫెడరేషన్ కప్ స్కేటింగ్ పోటీల్లో రాష్ట్రానికి వెండి పతకం సాధించిన విజయవాడకు చెందిన సి.హెచ్.వి. దాక్షిణ్య అమరావతి సచివాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దాక్షిణ్యను అభినందించి, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బిగ్ చాంపియన్స్ స్కేటింగ్ అకాడమీ కోచ్ షేక్ ఖాదర్ భాష మాట్లాడుతూ, దాక్షిణ్య అతి చిన్న వయసులోనే స్కేటింగ్‌లో 35 కిలోమీటర్ల మేర ప్రదర్శన చేసి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడంతో పాటు రెండు జాతీయ అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాక్షిణ్య తండ్రి కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సి.హెచ్.సంపత్ కుమార్ ఉన్నారు.




# ప్రపంచ శాంతికి భగవద్గీతనే మార్గదర్శి


**డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు.**

**ఘనంగా ముగిసిన ధార్మిక కార్యక్రమాలు**

**నంద్యాల (జయ జయహే)**



ప్రపంచంలో శాశ్వత శాంతి నెలకొనాలంటే వ్యక్తిలో విలువలు, సమాజంలో ధర్మం, నాయకత్వంలో నిష్కామ సేవాభావం ఉండాలని, ఈ మూడు అంశాలను సమగ్రంగా బోధించిన మహాగ్రంథం భగవద్గీత మాత్రమేనని ప్రముఖ సంస్కృత పండితులు, వ్యాఖ్యాత, ధార్మిక ప్రవచకులు డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు అన్నారు. నంద్యాల పట్టణం, బాల్కొండ హాలువద్ద వెలసిన శ్రీ మోక్షరామచంద్రస్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. మూడు రోజులు , శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ప్రముఖ వైద్యులు గెలివి సహదేవుడు, సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు డి.మధు సుధన్ రావు, డి.రాంప్రసాద్, వీరన్న, రామ్మూర్తి, శ్రీనివాసులు, పవన్ కుమార్, శంతన్, మనోజ్, నవనీత్, రామకృష్ణతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




# మాడుగులలో పశు గ్రాస వారోత్సవాలు

**మాడుగుల జులై 10 జయ జయహే**

పశు గ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మాడుగుల లో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులకు పశుగ్రాసాల సాగు ప్రాముఖ్యతను మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు డా. చిట్టినాయుడు వివరించారు.పశువైద్యశాలల ద్వారా కాకి జొన్న, మొక్కజొన్న గడ్డి విత్తనాలు సబ్సిడీపై అమ్మకానికి సిద్ధం గా ఉన్నాయని తెలిపారు. పశువులకు మేలైన పోషణ అందివ్వడానికి మొక్కజొన్న,జొన్న,అలసందలు,హైబ్రిడ్ నేపియర్ (సజ్జలు),పిల్లిపెసర వంటి వాటిని పశు గ్రాసంగా పెంచుకోవాలనీ సూచించారు. ప్రధాన పొలం లోనే కాకుండా వీటిని పొలం గట్లపైన కూడా పెంచుకోవచ్చన్నారు. అయితే మనకున్న పొలాన్ని, నీటి వసతులని బట్టి వీటిని ఎంపిక చేసుకోవాలన్నారు. వర్షపాతం, నీటి పారుదల ఎక్కువగా ఉంటే హైబ్రిడ్ నేపియర్ మొక్కజొన్నలను ఎంపిక చేసుకోవాలి. నీటి వసతి లేకుంటే జొన్నలు, సజ్జలను ఎంచుకోవాలనీ సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రధాన ధ్యేయం

**ప్రజలకు చేరువగా పాలన**

**చోడవరం జులై 10 జయ జయహే**




ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు చెప్పారు. శుక్రవారం చోడవరం కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రం స్వీకరించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. అర్జీదారుల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ వచ్చిన సమస్యలను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించగల అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన సమస్యలను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మరికొన్ని సమస్యలను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి నిరంతరం పర్యవేక్షించాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు తెలిపారు. అనేకమంది ప్రజలు ఎమ్మెల్యేకు అధి పత్రాలు అందజేశారు

# ఏపీ తొలి మోడల్ పుష్కర గ్రామంగా తీపర్రు

## మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం, జూలై 10 (జయజయహే ప్రతినిధి):**

రాబోయే 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నిడదవోలు నియోజకవర్గంలోని తీపర్రు గ్రామాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి మోడల్ పుష్కర గ్రామంగా, స్థానిక ఘాట్‌ను మోడల్ పుష్కర ఘాట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. తదేకం ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.శనివారం (జూలై 11) మధ్యాహ్నం 3 గంటలకు తీపర్రు గ్రామంలో నిర్వహించనున్న "మా గోదావరి సంకల్ప్" కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా ప్రారంభించనున్నారు. సంక్రాంతి-2027 నాటికి తీపర్రును పూర్తిస్థాయి మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం గోదావరి తీరంలోని ఇతర గ్రామాల్లో కూడా ఇదే నమూనాను అమలు చేయనున్నట్లు చెప్పారు.తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, తీపర్రు గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ 'నీరి' సహకారంతో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు





పేర్కొన్నారు. గ్రామ చెరువు పునరుద్ధరణ, నీటి మొక్కల తొలగింపు, పరిశుభ్రత కార్యక్రమాలు, ప్లాస్టిక్ వినియోగంపై నిషేధ ప్రచారం వంటి చర్యలు అమలు చేస్తామని వివరించారు.పర్యాటకులను ఆకర్షించేలా "ఐ లవ్ గోదావరి -- మా తీపర్రు" పేరుతో రెండు సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే 25 హోమ్ స్టేలు ఏర్పాటు చేయడం, ఘాట్ వెంట హెరిటేజ్ వీధుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, స్థానిక కాలువలో కయాకింగ్ వంటి అడ్వెంచర్ స్పోర్ట్స్ ప్రవేశపెట్టే ప్రణాళికలను వెల్లడించారు. గ్రామ చరిత్రను వెలికితీసి ప్రత్యేక లోగో, స్లోగన్ రూపొందించి ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు.తీపర్రు ఘాట్ ఎంపికకు గ్రామస్థుల స్వచ్ఛంద సహకారం, మెరుగైన రవాణా సౌకర్యాలు ప్రధాన కారణమని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. దాతల సహకారంతో మరిన్ని మౌలిక వసతులు కల్పించి, ఇదే స్ఫూర్తితో గోదావరి పరివాహక ప్రాంతంలోని ఇతర ఘాట్లను కూడా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. "మా గోదావరి సంక్రాంతి-2027" కార్యక్రమంలో భాగంగా ముక్కామల, ముక్తేశ్వరం, కుండలీశ్వరం, కొవ్వూరు తదితర ప్రాంతాల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, 2027 గోదావరి పుష్కరాలను కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. పుష్కరాల నాటికి అన్ని ప్రధాన ఘాట్లలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, పరిశుభ్రమైన, పర్యావం-ణహిత వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తీపర్రు ఘాట్ అభివృద్ధికి ముందుకొచ్చిన తదేకం ఫౌండేషన్ సేవలను మంత్రి అభినందించారు.పుష్కర ఘాట్లను ప్లాస్టిక్ రహితంగా, కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజల సహకారంతో విస్తృత కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఏ ఘాట్‌లో స్నానం చేసినా అదే పుణ్యఫలం లభిస్తుందని పేర్కొంటూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంకల్పించిన "స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు" లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో ఆచరణలో చూపించే ఆదర్శ గ్రామంగా తీపర్రును తీర్చిదిద్దుతామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

For a pure tomorrow.. జయహో



## యురేనియంతో బలపడిన
# భారత్-ఆస్ట్రేలియా మైత్రి

(సి.హెచ్.ప్రతాప్)

మెల్‌బోర్న్‌లో జరిగిన భారత్--ఆస్ట్రేలియా శిఖరాగ్ర సమావేశం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపునిచ్చింది. ముఖ్యంగా పౌర అణుశక్తి రంగంలో కుదిరిన కీలక ఒప్పందం, ఇంధన భద్రతతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసింది. 2014--15లో ఇరు దేశాలు పౌర అణుశక్తి సహకార ఒప్పందంపై సంతకాలు చేసినప్పటికీ, పరిపాలనా విధానాలు, అంతర్జాతీయ పర్యవేక్షణ నిబంధనలు, దౌత్యపరమైన ప్రక్రియలు పూర్తికాకపోవడంతో ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరా ప్రారంభం కాలేదు. ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ తొలగిపోవడంతో తుది అమలు ఒప్పందాలు పూర్తయ్యాయి. దీంతో ఆస్ట్రేలియా నుంచి భారతదేశానికి యురేనియం సరఫరాకు మార్గం సుగమమైంది.

ప్రపంచంలో అత్యధికంగా, దాదాపు 28 శాతం యురేనియం నిల్వలు ఆస్ట్రేలియాలోనే ఉన్నాయి. మరోవైపు, పరిశుభ్రమైన ఇంధన వనరుల వైపు అడుగులు వేస్తున్న భారతదేశం 2047 నాటికి అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 100 గిగావాట్లకు పెంచాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం దేశంలోని అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం సుమారు 8.78 గిగావాట్లు మాత్రమే. ఈ నేపథ్యంలో స్థిరమైన యురేనియం సరఫరా భారత అణుశక్తి కార్యక్రమానికి కొత్త బలాన్ని అందించనుంది. బొగ్గు ఆధారిత విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు కార్బన్ ఉద్గారాలను నియంత్రించి, 2070 నాటికి నెట్-జీరో ఉద్గారాల లక్ష్యం సాధించడంలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించనుంది.

అణుశక్తి సహకారంతో పాటు ఇరు దేశాలు మొత్తం 18 కీలక ఒప్పందాలపై సంతకాలు చేయడం విశేషం. రక్షణ, సముద్ర భద్రత, అరుదైన ఖనిజాల సరఫరా, స్వచ్ఛ ఇంధనం, కీలక సాంకేతికతలు, సరఫరా గొలుసుల (సప్లై చైన్) భద్రత వంటి అనేక రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు అంగీకరించాయి. ఓడల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణ, ఇండో--పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రతను బలోపేతం చేయడానికి ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించాయి. ఉగ్రవాద నిర్మూలన, రక్షణ సమాచార మార్పిడి, వ్యూహాత్మక సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేయడంపైనా ఉమ్మడి సంకల్పాన్ని ప్రకటించాయి. అలాగే ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం అమలును వేగవంతం చేయాలని ఇరు దేశాల ప్రధానులు నిర్ణయించారు.

విద్యా, పరిశోధన రంగాల్లో కూడా ఈ భాగస్వామ్యం కొత్త అవకాశాలకు నాంది పలికింది. గురుగ్రామ్, బెంగళూరులో ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు మార్గం సుగమమవుతోంది. విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, కృత్రిమ మేధస్సు, ఖనిజ సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ ఆవిష్కరణలు వంటి రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. కీలక ఖనిజాల అన్వేషణ, సెమీకండక్టర్లు, బ్యాటరీ సాంకేతికత వంటి భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన రంగాల్లో కూడా భాగస్వామ్యాన్ని విస్తరించనున్నారు.

ఈ ఒప్పందం 2014--15లో కుదిరిన పౌర అణు ఒప్పందానికి కార్యరూపం దాల్చినట్లే కాకుండా, భారత్--ఆస్ట్రేలియా సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లింది. ఇంధన భద్రత, రక్షణ సహకారం, సాంకేతిక అభివృద్ధి, విద్యా రంగం, సముద్ర భద్రత, ఇండో--పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం వంటి అంశాల్లో ఈ భాగస్వామ్యం దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించనుంది. పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చుకోవడంతో పాటు స్వచ్ఛమైన అభివృద్ధి దిశగా భారతదేశం వేస్తున్న అడుగులకు ఈ అణుబంధం బలమైన పునాదిగా నిలవనుంది.

## చేనేతకు చేయూత మాత్రమే కాదు...
# చైతన్యవంతమైన వ్యవస్థే పరిష్కారం

(డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ )

### రాష్ట్రవ్యాప్త చేనేత పార్క్, క్లస్టర్ విధానం, సమగ్ర సర్వేతోనే చేనేత రంగ పునరుజ్జీవనం

**అగ్గిపెట్టెలో ఇమిడేంత పలుచని చీరను, చేతి ఉంగరంలో దూరిపోయేంత సున్నితమైన వస్త్రాన్ని నేసే చేతులు నేడు జీవన భద్రత కోసం ప్రభుత్వ పథకాలపై ఆధారపడాల్సి వస్తుండటం మన సమాజం, ఆర్థిక వ్యవస్థ, పాలనా విధానాల ముందున్న ఒక తీవ్రమైన ప్రశ్న. ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే కళాత్మకత, నైపుణ్యం, ఓర్పు, సృజనాత్మకత కలిగిన చేనేత కార్మికుడు నేడు తన కళకు తగిన గౌరవం, ఆదాయం, భద్రత కోసం ఎదురుచూస్తున్నాడు. ఇది వ్యక్తిగత వైఫల్యం కాదు; వ్యవస్థాగత లోపానికి ప్రతిబింబం.**



చేనేత భారతీయ సంస్కృతికి ప్రతీక. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. స్వాతంత్ర్యోద్యమ కాలంలో స్వావలంబనకు చిహ్నం. అయినప్పటికీ నేడు చేనేత రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. పెరుగుతున్న ముడిసరుకు ధరలు, మార్కెట్ అనిశ్చితి, మధ్యవర్తుల ఆధిపత్యం, యాంత్రిక వస్త్ర పరిశ్రమల పోటీ, యువతలో వృత్తిపట్ల తగ్గుతున్న ఆసక్తి, అసంఘటిత మార్కెటింగ్ వ్యవస్థలు ఈ రంగాన్ని క్రమంగా బలహీనపరుస్తున్నాయి.

2024-25 సామాజిక-ఆర్థిక సర్వే గణాంకాలు పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. రాష్ట్రంలో సహకార రంగంలో 2,00,310 మంది, సహకార రంగం వెలుపల 1,58,902 మంది కలిపి సుమారు 3,59,212 మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 986 చేనేత సహకార సంఘాలు ఉన్నప్పటికీ వాటిలో గణనీయమైన సంఖ్యలో సంఘాలు పూర్తిస్థాయి కార్యకలాపాలు నిర్వహించడం లేదు. మరోవైపు ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద పదివేలల్లో కుటుంబాలు సహాయం పొందుతున్నాయి. ఈ గణాంకాలు ఒక వాస్తవాన్ని తెలియజేస్తున్నాయి. చేనేత కార్మికుడికి నైపుణ్యం కొరవడలేదు; అతనికి తోడ్పడే సమగ్ర వ్యవస్థ కొరవడింది.

ఇప్పటి వరకు అమలవుతున్న పథకాలు అవసరమైనవే. నేతన్న నేస్తం, ఉచిత విద్యుత్, పెన్షన్లు, సబ్సిడీలు వంటి చర్యలు అనేక కుటుంబాలకు ఉపశమనాన్ని అందించాయి. అయితే సంక్షేమం ఒక ఆధారం మాత్రమే; అది అభివృద్ధికి ప్రత్యామ్నాయం కాదు. నిరంతరం ఆర్థిక సాయం అందించడం కంటే, చేనేత కార్మికుడు తన నైపుణ్యంతో గౌరవప్రదమైన ఆదాయం సంపాదించే పరిస్థితులను సృష్టించడం మరింత ముఖ్యమైనది.

ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని చేనేత సహకార సంఘాలను ప్రాంతాల వారీగా క్లస్టర్లుగా పునర్వ్యవస్థీకరించి, వాటిని అనుసంధానించే సమగ్ర చేనేత పార్క్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇది ఒకే చోట నిర్మించే పారిశ్రామిక పార్క్ కాకూడదు. రాష్ట్రంలోని అన్ని చేనేత కేంద్రాలను ఒకే అభివృద్ధి వేదికపైకి తీసుకువచ్చే వికేంద్రీకృత వ్యవస్థగా ఉండాలి.

శ్రీకాకుళం జిల్లాలోని రాజాం, కొరసవాడ, పాతపట్నం, సోంపేట, కవిటి, మందస, మందరాడ వంటి ప్రాంతాల నుంచి విజయనగరం, పార్వతీపురం-మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల వరకు, అలాగే రాష్ట్రంలోని ఇతర చేనేత కేంద్రాల వరకు ఉన్న సహకార సంఘాలను ప్రాంతీయ క్లస్టర్లుగా అభివృద్ధి చేయాలి. ప్రతి క్లస్టర్‌కు ప్రత్యేక ఉత్పత్తి లక్ష్యాలు, మార్కెటింగ్ అవకాశాలు, శిక్షణా కేంద్రాలు, నాణ్యత ప్రమాణాలు, బ్రాండింగ్ వ్యూహాలు రూపొందించాలి.

ఈ చేనేత పార్క్ వ్యవస్థలో నూలు బ్యాంకులు, ఆధునిక డైయింగ్ యూనిట్లు, డిజైన్ అభివృద్ధి కేంద్రాలు, నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలు, పరిశోధన విభాగాలు, శిక్షణా సంస్థలు, ప్యాకేజింగ్ యూనిట్లు, డిజిటల్ మార్కెటింగ్ కేంద్రాలు, ఎగుమతి ప్రోత్సాహ విభాగాలు సమన్వయంతో పనిచేయాలి. మగ్గం నుంచి మార్కెట్ వరకు మొత్తం విలువ గొలుసును ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలి.

అయితే ఈ మార్పుకు పునాది రాష్ట్రవ్యాప్త సమగ్ర సర్వే కావాలి. ప్రస్తుతం ఉన్న గణాంకాలు వేర్వేరు శాఖల్లో వేర్వేరు రూపాల్లో ఉన్నాయి. ప్రతి చేనేత కుటుంబాన్ని గుర్తించి కుటుంబ పరిమాణం, వృత్తిలో పనిచేస్తున్న సభ్యుల సంఖ్య, నైపుణ్య స్థాయి, ఆదాయ పరిస్థితి, శిక్షణ పొందుతున్న యువత, భవిష్యత్తులో వృత్తిలోకి వచ్చే కుటుంబ సభ్యుల సంఖ్య వంటి వివరాలను నమోదు చేయాలి. భవిష్యత్తులో పెరిగే సంఖ్యా బలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ సమగ్ర సర్వే ఆధారంగానే విధానాలు రూపొందితే నిజమైన అర్హులకు పథకాల ప్రయోజనాలు చేరుతాయి.

ఈ కొత్త వ్యవస్థలో చేనేత కుటుంబాలకు చెందిన విద్యావంతులైన యువతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. ఉత్పత్తి నిర్వహణ, మార్కెటింగ్, మానవ వనరుల నిర్వహణ, సమాచార సాంకేతికత, అకౌంటింగ్, బ్రాండింగ్, ఎగుమతుల నిర్వహణ వంటి విభాగాల్లో వారినే భాగస్వాములుగా చేయాలి. చేనేత వృత్తి సమస్యలను అనుభవించిన కుటుంబాల నుంచే వచ్చిన యువత ఈ రంగ అవసరాలను మరింత లోతుగా అర్థం చేసుకోగలరు.

ఉద్యోగ భద్రతను కూడా ఈ వ్యవస్థలో కీలక అంశంగా చూడాలి. నైపుణ్యం, అనుభవం, ఉత్పాదకత ఆధారంగా గౌరవప్రదమైన వేతన వ్యవస్థను రూపొందించాలి. అనుభవజ్ఞులైన నేతలను శిక్షకులుగా, నాణ్యత పర్యవేక్షకులుగా, డిజైన్ నిపుణులుగా వినియోగించాలి. కొత్తగా చేరే వారికి శిక్షణతో పాటు జీవన భృతి కల్పించాలి. వృత్తిలో కొనసాగాలనే విశ్వాసాన్ని పునరుద్ధరించాలి.

ప్రపంచ మార్కెట్‌లో నేడు హస్తకళలకు, సంప్రదాయ వస్త్రాలకు ప్రత్యేక ఆదరణ ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పొందూరు ఖాదీ, బొబ్బిలి చేనేత వంటి ప్రాంతీయ ప్రత్యేకతలను అంతర్జాతీయ స్థాయి బ్రాండ్లుగా అభివృద్ధి చేయాలి. చేనేత ఉత్పత్తులను కేవలం వస్త్రాలుగా కాకుండా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలుగా ప్రపంచానికి పరిచయం చేయాలి.

చేనేతను కాపాడటం అంటే కేవలం ఒక వృత్తిని రక్షించడం కాదు; ఒక సంస్కృతిని, ఒక చరిత్రను, లక్షలాది కుటుంబాల భవిష్యత్తును కాపాడటం. చేనేత కార్మికుడిని సంక్షేమ పథకాల లబ్ధిదారుడిగా కాకుండా అభివృద్ధి భాగస్వామిగా గుర్తించే సమయం ఆసన్నమైంది. చేయూత అవసరమే. కానీ చేయూత ఒక్కటే సరిపోదు. సమగ్ర సర్వే, క్లస్టర్ విధానం, రాష్ట్రవ్యాప్త చేనేత పార్క్, విద్యావంతుల భాగస్వామ్యం, మార్కెట్ ఆధారిత అభివృద్ధి, ఉద్యోగ భద్రతలతో కూడిన చైతన్యవంతమైన వ్యవస్థను నిర్మించాలి.

చేనేతకు నిజమైన రక్షణ తాత్కాలిక పథకాలలో లేదు. చేనేతకు నిజమైన భవిష్యత్తు వ్యవస్థాగత పునర్నిర్మాణంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సహకార సంఘాలు, చేనేత కార్మికులు, నిపుణులు కలిసి ఈ దిశగా అడుగులు వేస్తేనే మగ్గం శబ్దం మళ్లీ అభివృద్ధి గీతంగా మారుతుంది. అందుకే నేడు స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉంది .

చేనేతకు చేయూత మాత్రమే కాదు చైతన్యవంతమైన వ్యవస్థే పరిష్కారం.

# డిజిటల్ యుగంలో కుటుంబాలకు విశ్వాస పరీక్ష

(సి.హెచ్.ప్రతాప్)

**భారతీయ సంస్కృతికి కుటుంబ వ్యవస్థే వెన్నెముక. ప్రేమ, పరస్పర గౌరవం, బాధ్యత, త్యాగం, విశ్వాసం అనే విలువలపై నిలిచిన భారతీయ కుటుంబాలు ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి. తల్లిదండ్రులు, పిల్లలు, భార్యాభర్తలు, అన్నదమ్ములు, బంధువుల మధ్య ఉన్న ఆత్మీయత కుటుంబాన్ని కేవలం రక్తసంబంధాల సమూహంగా కాకుండా భావోద్వేగాల ఆలయంగా తీర్చిదిద్దేది. అయితే మారుతున్న సామాజిక పరిస్థితులు, వేగవంతమైన జీవనశైలి, సాంకేతిక ప్రభావం నేపథ్యంలో కుటుంబ సభ్యుల మధ్య అవిశ్వాసం అనే మౌన సంక్షోభం క్రమంగా పెరుగుతోంది. ఈ ధోరణి కుటుంబాలను మాత్రమే కాదు, సమాజ స్థిరత్వాన్ని కూడా సవాలు చేస్తోంది.**



ఒకే ఇంట్లో నివసిస్తున్నప్పటికీ, మనుషులు మనసుకు మనసు దూరమవుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వినోదం కుటుంబ సంభాషణలను గణనీయంగా తగ్గించాయి. ఒకప్పుడు భోజన సమయంలో, సాయంత్రం వేళల్లో లేదా పండుగ సందర్భాల్లో గంటల తరబడి మాట్లాడుకునే కుటుంబాలు, ఇప్పుడు ఒకరినొకరు చూసుకునే సమయం కూడా దొరకని పరిస్థితికి చేరుకున్నాయి. సంభాషణ తగ్గిన చోట అపోహలు పెరుగుతాయి; అపోహలు పెరిగిన చోట అనుమానాలు పుట్టుకొస్తాయి; అనుమానాలు బలపడిన చోట విశ్వాసం క్రమంగా కరిగిపోతుంది.

ఆర్థిక స్వాతంత్ర్యం ప్రతి వ్యక్తికి అవసరమే అయినప్పటికీ, కుటుంబ ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత లేకపోతే అవిశ్వాసానికి అది బీజం వేస్తుంది. సంపాదన, పొదుపు, పెట్టుబడులు, అప్పులు, వారసత్వ ఆస్తుల వంటి అంశాలపై స్పష్టత లేకపోవడం కుటుంబ విభేదాలకు కారణమవుతోంది. కొన్ని సందర్భాల్లో ఆస్తుల విలువ బంధాల విలువను మించిపోవడం బాధాకరమైన వాస్తవంగా మారుతోంది. ఆర్థిక విషయాల్లో రహస్యాలు, పరస్పర అనుమానాలు పెరిగినప్పుడు కుటుంబ ఐక్యత దెబ్బతింటుంది.

డిజిటల్ యుగం మరో కొత్త సవాలును తీసుకొచ్చింది. సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో ఏర్పడే సంబంధాలు, నకిలీ గుర్తింపులు, ఆన్‌లైన్ మోసాలు, గోప్యతకు సంబంధించిన సమస్యలు కుటుంబ సభ్యుల మధ్య అనుమానాలను మరింత పెంచుతున్నాయి. మొబైల్ ఫోన్‌కు పాస్‌వర్డ్ పెట్టడం నుంచి మొదలై, వ్యక్తిగత సమాచారాన్ని దాచిపెట్టడం వరకు అనేక చిన్న విషయాలు కూడా పెద్ద అపోహలకు దారితీస్తున్నాయి. సాంకేతికతను వినియోగించడంలో సమతుల్యత కోల్పోతే, అది కుటుంబ బంధాలపై ప్రతికూల ప్రభావం చూపడం సహజం. ఈ మార్పుల ప్రభావం పిల్లలపై మరింత స్పష్టంగా కనిపిస్తోంది. తల్లిదండ్రులు పిల్లలతో నాణ్యమైన సమయం గడపకపోవడం, పిల్లలు తమ భావాలను తల్లిదండ్రులతో పంచుకోకపోవడం వల్ల భావోద్వేగ దూరం పెరుగుతోంది. చదువు, ఉద్యోగం, స్నేహాలు, వ్యక్తిగత నిర్ణయాల విషయంలో పరస్పర అవగాహన తగ్గినప్పుడు కుటుంబంలో ఉద్రిక్తతలు ఏర్పడుతున్నాయి. ప్రేమతో కూడిన మార్గదర్శకత్వం స్థానంలో అనుమానం, నిఘా, విమర్శలు పెరిగితే పిల్లలు కుటుంబానికి దూరమయ్యే ప్రమాదం ఉంది.

అవిశ్వాసం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు; అది సమాజ భవిష్యత్తును ప్రభావితం చేసే అంశం కూడా. కుటుంబమే ఒక వ్యక్తి మొదటి పాఠశాల. నిజాయితీ, బాధ్యత, పరస్పర గౌరవం, సహకారం వంటి విలువలు అక్కడే నేర్చుకుంటారు. కుటుంబాల్లో విశ్వాసం బలహీనపడితే అదే ప్రభావం సమాజంలోనూ కనిపిస్తుంది. వృద్ధుల సంరక్షణ తగ్గడం, విడాకుల సంఖ్య పెరగడం, ఒంటరితనం, మానసిక ఒత్తిడి, కుటుంబ హింస వంటి అనేక సామాజిక సమస్యలకు అవిశ్వాసం పరోక్షంగా కారణమవుతోంది.

ఈ పరిస్థితిని మార్చడం అసాధ్యం కాదు. కుటుంబ సభ్యులు ప్రతిరోజూ కొంత సమయం ఒకరితో ఒకరు స్వేచ్ఛగా మాట్లాడుకునే అలవాటును పెంపొందించుకోవాలి. కుటుంబ నిర్ణయాలు, ఆర్థిక వ్యవహారాలు పారదర్శకంగా నిర్వహించాలి. మొబైల్ ఫోన్లకు కొంత సమయం దూరంగా ఉండి, కలిసి భోజనం చేయడం, ప్రార్థన, విహారం లేదా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా భావోద్వేగ బంధాలను బలోపేతం చేయవచ్చు. పిల్లల మాటలను శ్రద్ధగా వినడం, వారి అభిప్రాయాలను గౌరవించడం, తప్పులను శిక్షలతో కాకుండా సంభాషణతో సరిదిద్దడం అవసరం. పాఠశాలలు, కళాశాలలు కూడా కుటుంబ విలువలు, భావోద్వేగ నైపుణ్యాలు, డిజిటల్ బాధ్యతలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా సమాజంలో కుటుంబ సలహా కేంద్రాలు, వివాహపూర్వ కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడం కాలానుగుణ అవసరం.

విశ్వాసం అనేది ఒక్కరోజులో ఏర్పడేది కాదు; నిరంతర నిజాయితీ, పరస్పర గౌరవం, ఓర్పు, ఆప్యాయతలతో క్రమంగా నిర్మితమయ్యే అమూల్యమైన బంధం. అనుమానం ఒక్క క్షణంలో సంబంధాన్ని విచ్ఛిన్నం చేయగలిగితే, విశ్వాసం తరతరాల అనుబంధాన్ని నిలబెట్టగలదు. అందువల్ల భారతీయ కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఆస్తుల కంటే ఆప్యాయతకు, స్వార్థం కంటే సహకారానికి, అనుమానాల కంటే సంభాషణకు, సాంకేతికత కంటే మానవీయ విలువలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. విశ్వాసంతో నిండిన కుటుంబాలే సుస్థిర సమాజానికి, శాంతియుత దేశానికి, విలువలతో కూడిన భారత భవిష్యత్తుకు నిజమైన పునాది.

# రెండోవారం కూడా సమస్యలు వెల్లువ





## సమస్యలు లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

### సత్ఫలితాలు ఇస్తున్న ప్రజా దర్బార్

**మాడుగుల జులై 10 జయ జయహే**

ఎక్కడికి అక్కడ సమస్యలు పరిష్కరించి సమస్యలు లేని సమాజం తయారు చేయాలన్న ప్రభుత్వ ఆకాంక్ష మేరకు నిర్వహిస్తున్న ఒక నెల నాలుగు వారాలు, నాలుగు సందర్శనల ప్రజా దర్బార్ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుందని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. శుక్రవారం మాడుగుల పి ఫోర్ కార్యాలయంలో జరిగిన రెండో విడత ప్రజా దర్బార్ లో కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడారు. వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. అధికారులందరూ సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నిర్వహించిన జన్మభూమి, ప్రజల వద్దకు పాలన వంటి కార్యక్రమాలు కన్నా ఈ ప్రజా దర్బార్ కార్యక్రమం పై మంచి స్పందన వస్తుందని అదే రీతిలో సత్వరం పరిష్కారం అవుతున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కారం అవుతున్నాయని చెబుతూ ఈ విషయంలో జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చొరవ ప్రశంసనీయమన్నారు. చాలా కాలంగా పెండింగ్లో ఉన్న కలిగొట్ల బ్రిడ్జి, కోణం వాలాబు బ్రిడ్జి, వినకోట పెద్దకోట బ్రిడ్జిలు మంజూరు చేశారని చెబుతూ కలెక్టర్. అలాగే మొదటి విడత కార్యక్రమం వలె రెండో విడత కార్యక్రమంలో కూడా సమస్యలు వెళ్ళు వెత్తాయి .తొలివారం 460 దరఖాస్తు అందగా, ఈసారి 414 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో 162 రెవెన్యూ సమస్యలు కాగా, మిగిలిన న 252 దరఖాస్తులు ఇతర విభాగాలకు చెందినవి. రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్తు, వ్యవసాయం, ఆర్టీసీ, ఆర్ అండ్ బి, పోలీస్, పి ఆర్, వైద్యం, పెన్షన్లు తదితర సమస్యలపై నాలుగు మండలాలు చెందిన ప్రజలు దరఖాస్తు అందజేశారు. వాటిలో భాగంగా శంకరం పంచాయతీ మునిపల్లికి రోడ్లు నిర్మించాలని, స్మశాన వాటిక నిర్మించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. గత 40 ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అలాగే దేవరపల్లి మండలం నాగయ్య పేటలో రహదారి మెరుగుపరచాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, రైతు బజార్ కార్డులు అందజేయాలని చిటిమిరెడ్డి నరసింగరావు కోరారు. మాడుగులకు చెందిన కొప్పాక రాధిక రాజబాబు అనే దంపతులు తన కుమారునీ కి దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మాడుగుల ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజియోథెరపిస్టును ఏర్పాటు చేయాలని జనసేన నాయకుడు రొబ్బా మహేష్ విజ్ఞప్తి చేశారు. అలాగే నూకాలమ్మ గుడి ప్రాంతంలో గల పొలాలకు రోడ్డు నిర్మించాలని ఆ ప్రాంత రైతుల విజ్ఞప్తి చేశారు. మాడుగుల మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పుప్పాల రమేష్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేస్తూ మాడుగుల ప్రభుత్వాసుపత్రిలో పూర్తిస్థాయి డాక్టర్లను నియమించాలని, ఘాటి రోడ్లో కాలువలు నిర్మించాలని కోరారు. అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించారని, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వై కళావతి, మరువాడ ఈశ్వరరావు కోరారు. వీరవిల్లి మాజీ సర్పంచ్ ఎస్ నారాయణరావు వినతిపత్రం అందజేస్తూ తమ జురాయితి పొలాలను దేవస్థానం భూములుగా రిజిస్టర్ కార్యాలయంలో చూపిస్తున్నారని వాటిని సరిచేయాలని కోరారు. అయితే ఇది ఎండోమెంట్ కమిషనర్ పరిధిలో ఉందని కలెక్టర్ చెప్పారు. రేఖం దేవుడమ్మ అనే మహిళ తనకు రెండు ఎకరాలు భూముందని 4000 కరెంట్ బిల్లు వస్తుందని ఇది అన్యాయం అని వాపోయింది. స్పందించిన ఎమ్మెల్యే బండారు ఉచిత విద్యుత్తు కదా వ్యవసాయానికి బిల్లు ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ విద్యుత్ అధికారులు ఆదేశించారు. ఎం కోటపాడు ఎంకె వల్లాపురం గ్రామాల మధ్యలో ఆర్టీసీ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు కోరారు. అలాగే కేజే పురం జంక్షన్ లో కూడా బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని విశ్రాంత ఉపాధ్యాయుడు రామ కొండలరావు కోరారు. పెన్షన్లతోపాటు ఇంకా అనేక సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేరు. అయితే మూడు నాలుగు సమస్యలపై కలెక్టర్ సంబంధిత అధికారులపై మండిపడ్డారు.నిర్లక్ష్యం వహిస్తే బదిలీ తప్పదు అంటూ పరోక్షంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, డిఆర్ఓ వై శ్రీనివాసరావు, నర్సీపట్నం ఆర్డిఓ వివి రమణ, డి ఆర్ డి ఎ పిడి కే సచిదేవి మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు తో పాటు వివిధ శాఖల చెందిన జిల్లా,డివిజన్, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పట్టాలిచ్చి ప్రభుత్వ పథకాలకు

# చేరువ చేయండి

### ప్రజా దర్బార్లో గిరిజనుల వినతి

**మాడుగుల జులై 10 జయ జయహే**

మా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నా భూములకు సాగు హక్కు పట్టాలు అందజేసి ప్రభుత్వ పథకాలు అందేటట్టు చూడాలని మాడుగుల మండలం శంకరం పంచాయతీ గొప్పూరు గిరిజనులు కలెక్టర్ ను వేడుకున్నారు. శుక్రవారం మాడుగులలో జరిగిన పి జి ఆర్ ఎస్ లో వారు మాట్లాడుతూ తమ గ్రామంలో గల సుమారు 22 మంది కుటుంబీకులు 60 నుంచి 70 ఎకరాలు చేసుకుంటూ జీడి, మామిడి తోటలు పెంచుకుంటున్నామని, ఇందు నిమిత్తం ప్రైవేటుగా అప్పులు చేసుకోవాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేశామని సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చి ప్రభుత్వపరమైన సహకారం పొందే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఒక పరిశీలన జలపాలని కలెక్టర్ తహసిల్దార్ని ఆదేశించారు. అలాగే తమ గ్రామంలో ఇప్పటివరకు ఏ దేవాలయం లేదని కాబట్టి రామాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే గోటివాడ నుంచి రాజంపేట వరకు రోడ్డు నిర్మాణం చేపడితే తమ గ్రామాలకు రహదారి రవాణా సౌకర్యాలు ఏర్పడగలవని కలెక్టర్ను కోరారు. వీటి మీద చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆదేశించారు.




## జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**అనకాపల్లి జులై శుక్రవారం10 జయ జయహే**

స్థానిక గవరపాలెం అగ్గి మర్రి చెట్టు వద్ద వేంచేసి ఉన్న శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి దేవస్థానం లో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరగనున్నది దీనికి పురస్కరించుకుని స్వామివారి రథోత్సవ మహోత్సవ ఆహ్వాన పత్రిక, గోడ పత్రికను భీమర శెట్టి రామ్ కి ఆవిష్కరించడం జరిగింది ఈ ఉత్సవాలు స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆశీస్సులతో సహకారంతో అత్యంత వైభవంగా ఉత్సవాల నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ ఇన్చార్జ్ రామ్ కి పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పది రోజులు పాటు వైభవంగా భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి దేవస్థానం ధర్మకర్తలు కమిటీ సభ్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు





## సిఎం చంద్రబాబు రాక..

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం : జయ జయహే : జులై 10**

ధవళేశ్వరం ఈనెల 13న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా, సిఎం పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్ ఏర్పాటుతో పాటు, బహిరంగ సభ నిర్వహించనున్న ప్రాంతాలను రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సిఎం పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకోవడంతో, ఎటువంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణానికి వచ్చే రైతులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ మరియు బారికేడింగ్పై అధికారులకు సూచనలు చేశారు.ఈ పరిశీలనా కార్యక్రమంలో ఆర్డీవో ఆర్. శివరాముడు, సౌత్ జోన్ డీఎస్పీ ఏ. శివ ప్రియ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, ఎంఆర్వో శ్రీనివాస్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, సిఐలు టి. గణేష్, వెంకటేశ్వరరావు తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రహదారులు మంజూరుకి ఎంపీపీ వినతి

**మాడుగుల జులై 10 జయ జయహే**

మాడుగుల మండలంలో గిరిజన గ్రామాలను కలుపుతూ పలు రహదారులను నిర్మించాలని ఎంపీపీ టీవి రాజారాం జిల్లా కలెక్టర్ కోరారు. శుక్రవారం మోడల్ జరిగిన రెండో విడత ప్రజా దర్బార్లో ఆయన కలెక్టర్కు వినతిపత్రం అందజేస్తూ మండలంలో సిరిపురం నుంచి మల్లెపూడు వరకు రహదారి నిర్మిస్తే జి మాడుగుల వెళ్ళేందుకు దగ్గరగా ఉంటాదని, అలాగే అందు శనివారం నుంచి సిరిపురం వరకు రోడ్డు నిర్మిస్తే చింతపల్లి వెళ్లేందుకు దగ్గరగా ఉంటదని పేర్కొన్నారు అలాగే సీత బంధల నుంచి అజయ్పురం వరకు రోడ్డు నిర్మిస్తే పలు గ్రామాలకు రహదారి రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. మాడుగుల గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఒమ్మలి జంక్షన్లో ఏదో ఒక వాణిజ్య బ్యాంకు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోరారు.



## దివ్యాంగుల ఆధ్యాత్మిక యాత్రకు ఆకుల ఫౌండేషన్ చేయూత

**బుచ్చయ్యపేట జయ జయహే**

ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుచ్చయ్యపేట, మాడుగుల, కసింకోట, ఎలమంచిలి మండలాలకు చెందిన 12 మంది దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులకు కాశీ--ప్రయాగ్‌రాజ్--అయోధ్యతో పాటు ఢిల్లీ పర్యటనను ఆకుల ఫౌండేషన్ అధినేత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సాగిన ఈ పుణ్యయాత్రను ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేశారు.యాత్రలో ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ అధినేత ఆకుల నాగేశ్వరరావు, జిల్లా దివ్యాంగుల సంఘం ఉపాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, మండల కార్మిక సంఘం నాయకుడు కొయ్య శ్రీనివాసరావు, వీఆర్‌పీఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇంటికే పరిమితమై పవిత్ర క్షేత్రాలను దర్శించుకునే అవకాశం లేని దివ్యాంగులను గుర్తించి, భారతీయ రైల్వే కల్పిస్తున్న 75 శాతం ప్రయాణ రాయితీని వినియోగించుకొని వారికి ఈ పుణ్యయాత్రను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాత్రలో పాల్గొన్న వారందరికీ వారం రోజుల పాటు భోజనం, వసతి, రవాణా తదితర అన్ని ఏర్పాట్లను ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ ఉచితంగా కల్పించినట్లు చెప్పారు.పర్యటనలో భాగంగా ఢిల్లీలోని ఎర్రకోట, జాతీయ నాయకుల సమాధులు, మ్యూజియంలను సందర్శించారు. అనంతరం కాశీలో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి, శ్రీ అన్నపూర్ణ అమ్మవారి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం, అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయాన్ని సందర్శించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. యాత్రలో పాల్గొన్న దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

## జాతీయ చేపల రైతు దినోత్సవ వేడుకలు


# మత్స్యరంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం

**రాజమహేంద్రవరం :జయ జయహే, జులై 10:**

కడియం: మత్స్యశాఖ ఆధ్వర్యంలో కడియంలోని జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో 'జాతీయ చేపల రైతు దినోత్సవం' ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మల కుమారి మాట్లాడుతూ, మత్స్యరంగ అభివృద్ధిలో శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు.1957 జులై 10న ఒడిశాలోని కటక్‌లో గల సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి, డాక్టర్ అలీ కున్హీలు మేజర్ కార్ప్ చేపల 'ప్రేరేపిత సంతానోత్పత్తి' సాంకేతికతను ప్రపంచానికి పరిచయం చేశారు. ఈ చారిత్రాత్మక విజయానికి గుర్తుగా ప్రతి ఏటా జులై 10న జాతీయ చేపల రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆమె తెలిపారు.నిర్మల కుమారి ప్రసంగంలోని ప్రపంచవ్యాప్తంగా మంచినీటి చేపల ఉత్పత్తిలో భారతదేశం రెండో స్థానంలో ఉండగా, దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని గర్వంగా పేర్కొన్నారు.చేపల పెంపకం గ్రామీణ ప్రాంతాల్లో వేలాది కుటుంబాలకు ప్రధాన జీవనోపాధిగా మారిందని, ఆహార భద్రతలో మత్స్య సంపద కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా, చేపల విత్తనాలను నాణ్యంగా పెంచి మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేయవచ్చని సూచించారు.మత్స్యరంగ ఆర్థికాభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్న అక్వా రైతులకు ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ అనపర్తి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పులకుర్తి శ్రీనివాసు, శ్రీకృష్ణపట్నం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొల్లాం రత్నంలను మత్స్యశాఖ అధికారులు శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ఎం. బ్రహ్మానందం, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, రాష్ట్ర మత్స్య సహకార సంఘం జెఎసి . సత్తిబాబు, వివిధ మత్స్య సహకార సంఘాల సభ్యులు, శాఖా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



For a pure tomorrow.. జయహే



## నేటి నుంచి అందుబాటులోకి రానున్న రైల్వే పార్కింగ్

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణంలో గల రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా గత కొంతకాలంగా రైల్వేస్టేషన్లో గల ప్రయాణికులు వాహనాలు పెట్టుకున పార్కింగ్ స్థలం లేక రైల్వే స్టేషన్ ఎదురుగా గల రోడ్డులో వాహనాలు పార్కింగ్ నిత్యం అక్కడ పెట్టడం జరుగుతున్నది. దీనితో ఆ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు కు వాహన దారులకు రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా . గత కొన్ని నెలల నుంచి కొన్ని లక్షల కోట్లతో అనకాపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనులు సర వేగంగా జరుగుతున్నాయి అందులో భాగంగా నేటి నుండి రైల్వే స్టేషన్ ఆవరణలో గల రైల్వే పార్కింగ్ నేటి నుండి అందుబాటులోకి రానున్నట్లు రైల్వే సీఐ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నేటి నుండి రైల్వే పార్కింగ్ పశ్చిమ భాగంలో మోటారు సైకిళ్ళు తూర్పు భాగంలో కార్ల పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలుపుతూ ఇవి కూడా ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చని ఎవరికీ డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదని ఆయన తెలియజేశారు. రైల్వే పార్కింగ్ ప్లేస్ కీ టెండర్లు ఎవరు ముందుకు రాలేదని అందుకు కొన్నాళ్ల వరకు వాహనదారులకు వాహనాలు ఉచితంగా పెట్టుకోవచ్చని ఆయన తెలియజేశారు ఎవరికీ డబ్బులు చెల్లించిన అవసరం లేదని, అలాగే రైల్వే గూడ్స్ షెడ్ వైపు కూడా వాహనాలు పార్కింగ్ ఉచితంగా పెట్టుకోవచ్చని ఆయన తెలియజేశారు. గత కొంతకాలంగా వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు నేటితో తొలగిపోతున్నాయి




## ఉత్కంఠభరితంగా రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ ఎన్నికలు

**ఏడు సంవత్సరాల తర్వాత జరిగిన పోలింగ్‌లో కొత్త కార్యవర్గానికి జర్నలిస్టుల తీర్పు --**

**మోతా బాల విజయసారథి అధ్యక్షుడు, గండ్రోతు వేణుగోపాలస్వామి కార్యదర్శి**

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 10**

ఏడు సంవత్సరాల విరామం అనంతరం రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. మూడు ప్యానెళ్ల మధ్య హోరాహోరీ పోటీ నెలకొనగా, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు పూర్తికాగా నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు.నూతన అధ్యక్షుడిగా మోతా బాల విజయసారథి, కార్యదర్శిగా గండ్రోతు వేణుగోపాలస్వామి (గోపి) ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం విజేతలకు సహచర జర్నలిస్టులు అభినందనలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛాలు అందజేశారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధి, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవ పరిరక్షణకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు తెలిపారు.నూతన కార్యవర్గం

అధ్యక్షుడు:
మోతా బాల విజయసారథి
కార్యదర్శి:
గండ్రోతు వేణుగోపాలస్వామి (గోపి)
ఉపాధ్యక్షులు:
పి.ఎస్. గంగాధర్
కొత్తపల్లి దుర్గాప్రసాద్
సంయుక్త కార్యదర్శులు:
సోమాబత్తుల కృపానందం
కె.వి.ఎన్. వరప్రసాద్
కోశాధికారి:
శ్రీపాద పురుషోత్తమ కుమార్
కార్యవర్గ సభ్యులు:
ఆకల ఈశ్వర్
కొట్టే మధు
ఆర్.వి.వి. సత్యనారాయణ
పి. చంటిబాబు
పాలపర్తి శ్రీనివాస్
గరగ ప్రసాద్
జి.వి. గోపాలకృష్ణ

ఏడు సంవత్సరాల తర్వాత నిర్వహించిన ఈ ఎన్నికలు జర్నలిస్టుల్లో విశేష ఆసక్తిని రేకెత్తించాయి. మూడు ప్యానెళ్ల మధ్య జరిగిన పోటీ కారణంగా ఎన్నికలు చివరి వరకు ఉత్కంఠగా సాగాయి. నూతన కార్యవర్గం ప్రెస్ క్లబ్ అభివృద్ధితో పాటు జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం, సభ్యుల ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగాలని సభ్యులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.



## వడ్డాది కొత్తూరు పొలాలకు సీసీ రోడ్డు నిర్మాణం

**ఎమ్మెల్యే రాజు**

**బుచ్చియ్యపేట, జయ జయహే**

వడ్డాది కొత్తూరు దబ్బ జోర్లు పొలాలకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే రాజు కెఎస్ఎన్ఎస్ రాజు రాజు హామీ ఇచ్చారు.రైతుల విజ్ఞప్తి మేరకు స్వయంగా శుక్రవారం సాయంత్రం ఆయన స్వయంగా రెండు కిలోమీటర్ల మేరకు కాలినడకన వెళ్లి దారిని,పొలాలను పరిశీలించారు.వర్షాకాలంలో పొలాలకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు.రోడ్డు నిర్మాణం చేపడితే కుముందానిపేట, మంగళాపురం రైతులకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఈ ఏడాది తన గ్రాంట్లో విడుదలయ్యే నిధులులో వడ్డాదికే తొలి ప్రాధాన్యం కల్పించి రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.రెండు మూడు రోజుల్లో అధికారులను పంపించి ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తానన్నారు.రైతులందరికీ ఉపయోగపడేలా రోడ్డు నిర్మిస్తామన్నారు. అధికారులకు రైతులు సహకరించాలి అన్నారు. గతంలో విశాఖ డైరీ సహకారంతో నిర్మించామని గుర్తు చేశారు.విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ,స్థానిక కూటమి నేతలు దొండా సన్యాసిరావు, గిరిబాబు, సిరిగిరి శెట్టి శ్రీరామమూర్తి,సయ్యపురెడ్డి శ్రీనివాస్, సింగంపల్లి రమేష్,మండల టీడీపీ నేతలు దొంకిన అప్పలనాయుడు, వెలం కాయల అప్పలనాయుడు,స్థానిక పాల సంఘం మాజీ అధ్యక్షులు నాలం రాము నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## శివుని దర్శించుకున్న కేంద్రమంత్రి జీతన్ రామ్

**శ్రీకాళహస్తి, జులై 10,జయ జయహే.**

భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల శాఖ కేంద్ర మంత్రి, బీహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జీతన్ రామ్ మాంఝీ శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ , ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రీ విద్యాసాగర్ రెడ్డి , ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ , ఆలయ ఇన్స్పెక్టర్ హరి యాదవ్ , ఏపీఆర్ఓ సుబ్రహ్మణ్యం , తహసీల్దార్ సుబ్రహ్మణ్యం , ఉప తహసీల్దార్ అనిల్ , దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## పల్లమాల సుధీర్‌కి నివాళి అర్పించిన ఎమ్మెల్యే బొజ్జల

**శ్రీకాళహస్తి, జులై 10,జయ జయహే**

ఆర్టీసీ మాజీ ఎన్ ఎం యూ వైస్ ప్రెసిడెంట్, తెలుగు భాషా అభివృద్ధి సేవాసమితి అధ్యక్షులు, సీనియర్ కార్మిక నాయకులు, శ్రీకాళహస్తికి చెందిన పల్లమాల సుధీర్కి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నివాళి అర్పించారు.పల్లమాల సుధీర్ మృతి పరమపదించడం తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. సుధీర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారి అంత్యక్రియల సన్నాహాల్లో పాల్గొని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.



## పుష్కరాలకు సర్వం సిద్ధం

**క్షేత్రస్థాయిలో జిల్లా యంత్రాంగం కసరత్తు**

**పుష్కర్ నగర్లు, పార్కింగ్, హోల్డింగ్ ఏరియాల పరిశీలనలో కలెక్టర్, ఎస్పీ**

**రాజమహేంద్రవరం:జయ జయహే: జూలై 10**

రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి , జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ లు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. పుష్కర్ నగర్లు, వాహనాల పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను వారు పరిశీలించారు.క్షేత్రస్థాయిలో కీల ప్రాంతాల పరిశీలనపుష్కరాలకు విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వాహనాల రాకపోకలు భక్తుల నివాసానికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు అధికారులు పకడ్బందీ చర్యలుచేపడుతున్నారు.ఆటోనగర్, జీఎస్ఎల్ వెనుక ప్రాంతం, దివాన్ చెరువు జీరో పాయింట్, కేశవ హాస్పిటల్ రోడ్డు, గమన్ వంతెన--కాతేరు అండర్‌పాస్, కాతేరు సీటీఆర్ఐ భూములు, వ్యవసాయ కళాశాల పరిసరాలు, తిరుమల బస్ గ్రౌండ్ తిరుమల పాపయ్య నగర్.ఈ ప్రాంతాల్లో భక్తుల కోసం చేపట్టాల్సిన తాత్కాలిక వసతులు, వాహనాల పార్కింగ్ క్రమబద్ధీకరణ, హోల్డింగ్ ఏరియాల నిర్వహణ షటిల్ బస్సుల రాకపోకల అంశాలపై అధికారులతో లోతుగా చర్చించారు.సమన్వయంతో పుష్కర ఏర్పాట్లు పుష్కరాల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని, వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలని కలెక్టర్, ఎస్పీ దిశానిర్దేశం చేశారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో ప్రాథమిక చర్చలు జరిపామని, క్షేత్రస్థాయిలో గుర్తించిన ప్రదేశాల్లో ఏర్పాట్లు చేస్తామని వారు తెలిపారు.ఈ పరిశీలనా కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ , నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పాలగడ్డ నుండి పడాల చెరువు వరకు రోడ్డు నిర్మించండి

**మాడుగుల జూలై 10 జయ జయహే**

మాడుగుల గ్రామంలో గల పాల గెడ్డ నుండి పడాల చెరువు వరకు రైతుల ప్రయోజనం కోసం రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత రైతాంగం కోరుతుంది. ఈ మేరకు శుక్రవారం మాడుగుల్లో జరిగిన కలెక్టర్ ప్రజా దర్బార్ కార్యక్రమంలో రైతులు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ ప్రాంతంలో సుమారు 200 రైతులు ఉన్నారని అలాగే వారందరికీ సుమారు 300 ఎకరాలు భూముందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు వలన ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యంగా వర్షాకాలం వస్తే కాలు మోపులుని పరిస్థితి నెలకొందని రైతుల ఉత్పత్తులు ఇంటికి తెచ్చుకున్నందుకు నానా కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి పాలగడ్డ నుండి పడాల చెరువు వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులకు ప్రయోజనం చేకూర్చాలని కోరారు. అలాగే పాలగడ్డ వద్ద స్మశాన వాటిక నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.



## మాడుగుల రైతు పరిరక్షణ సమితి అధ్యక్షునిగా జోగారావు

**మాడుగుల జులై 10 జయ జయహే**

మాడుగుల మండలం రైతు పరిరక్షణ సమితి అధ్యక్షునిగా ఎం కోటపాడు కి చెందిన గుమ్మాల జోగారావు నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు మండడపు శ్రీనువాసరావు ఆదేశాలు మేరకు అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆడారి వరహా కన్నారావు శుక్రవారం నియామక పత్రం అందించారు.ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే పరమావధి గా తమ సేవలు అందిస్తానని తెలియజేసారు.గ్రామ స్థాయిలో రైతు సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.గిట్టుబాటు ధరలు పై ఎప్పటికప్పుడు రైతులను అవగాహన పరుస్తానన్నారు.ఎం.కోటపాడుకు చెందిన జోగారావు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.

# ఆర్‌టీఐ అమలులో ఏపీఈపీడీసీఎల్ భేష్

## రాష్ట్ర సమాచార కమిషనర్ పీఎస్ నాయుడు ప్రశంసలు

**విశాఖపట్నం, జూలై 10, జయ జయహే**

ఆర్‌టీఐ రికార్డుల నిర్వహణ విధానాన్ని పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు ఏపీఈపీడీసీఎల్ పనితీరును ప్రశంసించారు. శుక్రవారం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, సంస్థ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సమాచార హక్కు చట్టం-2005 అమలు తీరు, ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారం, మొదటి అప్పీళ్ల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ప్రజలకు సమాచారాన్ని అందించే విధానంపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు ఏపీఈపీడీసీఎల్‌లో ఆర్‌టీఐ రికార్డుల నిర్వహణ, దరఖాస్తుల నమోదు, ఫైళ్ల నిర్వహణ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను అత్యంత



క్రమబద్ధంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్న తీరును అభినందిస్తూ సంస్థ అధికారులను ప్రశంసించారు. సమాచార హక్కు చట్టం అమలులో ఏపీఈపీడీసీఎల్ అను-సరిస్తున్న విధానం ఆదర్శప్రాయంగా ఉందని పేర్కొంటూ, ఇదే విధమైన పనితీరును భవిష్యత్తులో కూడా కొనసాగించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు నిర్దేశిత గడువులోగా ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం ప్రతి ప్రభుత్వ సంస్థ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ మాట్లాడుతూ, సంస్థలో సమాచార హక్కు చట్టం నిబంధనలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ప్రజలకు సకాలంలో సమాచారాన్ని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషనర్ చేసిన సూచనలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) టి.వి. సూర్యప్రకాష్, చీఫ్ జనరల్ మేనేజర్ (హెచఆర్‌డీ) డి. సుమన్ కళ్యాణి, ఎసఈ గెడ్డం శ్యాంబాబు, ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విశాఖ కాలుష్య నియంత్రణపై ఉన్నతస్థాయి సమావేశం

**- పోర్టు పరిసర కాలుష్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**- హరితవనం పెంపు, రక్షణ గోడల నిర్మాణంపై పల్లా ప్రత్యేక సూచనలు**

**- అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి**

**- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**



**విశాఖపట్నం, జూలై 10, జయ జయహే**

విశాఖపట్నం పారిశ్రామిక నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణతో పాటు కాలుష్య నియంత్రణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన పరిశ్రమల సమీక్ష సమావేశంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, గణబాబు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, విశాఖలోని 18 ప్రధాన పరిశ్రమల ప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల నుంచి బొగ్గు ధూళి, పారిశ్రామిక కాలుష్యంపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను సమావేశంలో సవివరంగా చర్చించామని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాన బాధ్యతగా ప్రతి సంస్థ భావించాలని స్పష్టం చేశారు. కేవలం తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారాల దిశగా పరిశ్రమలు అడుగులు వేయాలని పల్లా సూచించారు. బొగ్గు నిల్వలపై టార్పాలిన్లు కప్పడం ఒక్కటే పరిష్కారం కాదని, తరచూ వాటిని తొలగించడం, మళ్లీ కప్పడం వల్ల అవి దెబ్బతినడంతో ఆశించిన ఫలితం ఉండదని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. అందుకే ప్రతి పరిశ్రమ తన విస్తీర్ణానికి అనుగుణంగా విస్తృతంగా హరితవనాలను అభివృద్ధి చేయడంతో పాటు, కనీసం 20 అడుగుల ఎత్తులో రక్షణ గోడలు నిర్మించి దుమ్ము, బొగ్గు కణాలు బయటకు వ్యాపించకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని సూచించినట్లు వెల్లడించారు. సమావేశంలో అధికారులు పరిశ్రమల ప్రతినిధులకు కాలుష్య నియంత్రణకు సంబంధించిన పలు మార్గదర్శకాలు జారీ చేయగా, వాటిని నిర్దిష్ట గడువులో అమలు చేయాలని ఆదేశించారు. విశాఖను పారిశ్రామికంగా అగ్రగామిగా తీర్చిదిద్దడంతో పాటు కాలుష్యరహిత నగరంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.



## బుల్లయ్య కాలేజీలో జాతీయ రసాయన శాస్త్ర సదస్సు

**- డిసెంబర్ 11, 12 తేదీల్లో నిర్వహణ**

**- బ్రోచర్‌ను ఆవిష్కరించిన కరస్పాండెంట్ డాక్టర్ జి. మధు కుమార్**

**విశాఖపట్నం, జూలై 10, జయ జయహే :**

"ఎమర్జింగ్ ఏరియాస్ ఆఫ్ కెమికల్ రీసెర్చ్" అంశంపై నిర్వహించనున్న జాతీయ సదస్సు అధికారిక బ్రోచర్‌ను డా. లంకపల్లి బుల్లయ్య కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి. మధు కుమార్ ఆవిష్కరించారు. ఈ జాతీయ సదస్సును రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ – ఇండియా డెక్కన్ లోకల్ సెక్షన్ సహకారంతో 2026 డిసెంబర్ 11 మరియు 12 తేదీలలో డా. లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మధు కుమార్ మాట్లాడుతూ, సమాజ అవసరాలు, సాంకేతిక అభివృద్ధి మరియు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న రసాయన శాస్త్ర పరిశోధన రంగాలపై ఈ సదస్సు ప్రధానంగా దృష్టి సారిస్తుందని తెలిపారు. దేశంలోని ప్రముఖ విద్యా, పరిశోధనా సంస్థలకు చెందిన ప్రఖ్యాత శాస్త్రవేత్తలు మరియు అధ్యాపకులు రెండు రోజులపాటు జరిగే సదస్సులో తమ పరిశోధనా పత్రాలు సమర్పించి ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. సదస్సులో గ్రీన్ అండ్ సస్టైనబుల్ కెమిస్ట్రీ, మెటీరియల్స్ కెమిస్ట్రీ, మెడిసినల్ అండ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ వంటి కీలక అంశాలపై చర్చలు మరియు సాంకేతిక సమావేశాలు నిర్వహించబడతాయని వెల్లడించారు. ఈ అంతరశాఖ జాతీయ సదస్సు సైన్స్ అధ్యాపకులు, పరిశోధకులు, పీజీ యూజీ విద్యార్థులు, ముఖ్యంగా రసాయన శాస్త్ర విభాగానికి చెందిన వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూజీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ (క్యాంపస్ కోఆర్డినేషన్), జాతీయ సదస్సు కన్వీనర్, వైస్ ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్ మరియు నమోదు వివరాలు కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు వినతిపత్రం....

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

భారతీయ జనతా పార్టీ తూర్పు గోదావరి జిల్లా కార్యాలయంలో గౌరవనీయులైన ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన "జనతా వారధి" కార్యక్రమంలో నిడదవోలు పట్టణ బీజేపీ అధ్యక్షుడు గూడూరి నరసింహ రాజు 10వ వార్డు ప్రజల తరఫున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా 10వ వార్డులో నెలకొన్న ప్రధాన ప్రజా సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. వార్డులో సుమారు మూడు అడుగుల వెడల్పు, ఐదు అడుగుల లోతు గల ప్రధాన మురుగు కాలువపై ప్రజల భద్రత దృష్ట్యా ఆర్‌సీసీ కాంక్రీట్ స్లాబులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జండాల వీధిలో ప్రతి వర్షాకాలంలో నిలిచిపోయే వర్షపు నీటికి శాశ్వత పరిష్కారం కల్పించేలా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలు ప్రజల భద్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్యం మరియు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని పేర్కొంటూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజును కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రజా సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు పట్టణ ఇన్‌చార్జ్ దేవన వెంకట పాపారావు, రంగా వెంకటేశ్వరరావు, తోరం శ్రీనివాస్ తదితరులు పాల్గొని వినతిపత్రం సమర్పణలో భాగస్వాములయ్యారు. 10వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని వారు తెలిపారు

## నేడు విజయవాడలో మైనారిటీ యువత కోసం రాష్ట్రస్థాయి మెగా జాబ్ మేళా

**సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చిన మంత్రి ఫరూక్**

**అమరావతి, (జయ జయహే)**



విజయవాడలో నిరుద్యోగ మైనారిటీ యువత కోసం రాష్ట్రస్థాయి మెగా జాబ్ మేళా ను ఈనెల 11వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు మైనారిటీ,న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇస్లాం పేట లోని షాజహూర్ ముసాఫిర్ ఖానాలో ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ మైనారిటీ యువత కోసం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రఖ్యాతిగాంచిన 60 నుండి 70 మల్టీ నేషనల్ సంస్థలు, డొమెస్టిక్ కంపెనీలు పాల్గొంటున్నట్లు మంత్రి తెలిపారు. ఐటి , బ్యాంకింగ్ , ఫైనాన్స్, హెల్త్ కేర్,లాజిస్టిక్స్, రిటైల్ తదితర రంగాలలో వివిధ స్థాయిలలో 2500 నుండి 3500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే జాబ్ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 10 వ తరగతి నుండి పీజీ దాకా చదివిన నిరుద్యోగులంతా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు.



## ప్రజల సమస్యలే ప్రాధాన్యం.. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

**రాజమహేంద్రవరం :జయ జయహే :జూలై 10:**

రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చేపట్టిన 'మన వార్డులో... మన ఆదిరెడ్డి' కార్యక్రమం 13, 14, 15 డివిజన్లలో విజయవంతంగా కొనసాగింది. రెల్లిపేటలోని కుంచమాంబ--పోలమాంబ ఆలయం వద్ద ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. డ్రైనేజీలు, సిసి రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, కాలువల శుభ్రత, విద్యుత్ అంతరాయాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ గృహాల వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, వార్డుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## తుడా చైర్మన్‌ను కలిసిన తిరుపతి టీడీపీ ఇన్‌చార్జి

**తిరుపతి, జూలై 10(జయ జయహే):**



తిరుపతి నియోజకవర్గ నూతన టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జేబీ శ్రీనివాస్ గురువారం తుడా చైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పరస్పరం శాలువాలు కప్పుకొని, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా అభినందనలు తెలియజేసుకున్నారు. జేబీ శ్రీనివాస్‌కు కొత్త బాధ్యతల సందర్భంగా డాలర్స్ దివాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేయగా, తుడా అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను జేబీ శ్రీనివాస్ కొనియాడారు. అనంతరం తిరుపతి నగర, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జనతా వారధిలో ప్రజా సమస్యల వెల్లువ

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 10:**

'మీ సమస్య... మా బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమం శుక్రవారం రాజమహేంద్రవరంలోని క్వారీ ఏరియాలో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. చాగలనాడు కాలువ నీటి విడుదల, గ్రామాల్లో డ్రైనేజీ సమస్యలు, రోడ్ల అభివృద్ధి, డంపింగ్ యార్డ్ ఏర్పాటు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలుసమర్పించారు. కొన్ని అత్యవసరసమస్యలపై సోము వీర్రాజు సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కార చర్యలు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే 'జనతా వారధి' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా భారతీయ జనతా పార్టీ ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ బొమ్మలు దత్తు, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనతా వారధి జిల్లా జట్టు సభ్యులు కృష్ణంరాజు, యానాపు ఏసు, స్వామి సూర్యకిరణ్, మీనాక్షితో పాటు పార్టీ జిల్లానాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గిరీష్ యాదవ్ నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న సత్యవేడు ఇంచార్జ్ కూరపాటి శంకర్ రెడ్డి

**బుచ్చినాయుడు కండ్రిగ, జూలై 10(జయ జయహే):-**

బుచ్చినాయుడు కండ్రిగ మండల మాజీ ఎంపీపీ బట్ట రమేష్ యాదవ్ కుమారుడు గిరీష్ యాదవ్ నిశ్చితార్థ వేడుకకు సత్యవేడు నియోజకవర్గ ఇంచార్జ్ కూరపాటి శంకర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బట్ట రమేష్ యాదవ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వధూవరుల జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బుచ్చినాయుడు కండ్రిగ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెంచు రామానాయుడు, తిరుపతి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కందేరి కార్తీక్ చౌదరి, క్లస్టర్ ఇంచార్జ్ మునిచంద్ర నాయుడు, సీనియర్ టీడీపీ నాయకులు కన్నయ్య నాయుడు, రవి నాయుడు, మధు నాయుడు,వఝ జడ్పిటిసి వీర రాఘవులు, రమణయ్య, కో-క్లస్టర్ ఇంచార్జ్ రమేష్, యూనిట్ ఇంచార్జ్ శశి యాదవ్, మనోహర్, మోహన్ యాదవ్ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జనసేనకు 'పీతల' కు ఎలాంటి బంధం లేదు

**- అధికారులపై ఆరోపణలన్నీ ఆయన వ్యక్తిగతం**

**- త్వరలోనే అధిష్టానం చర్యలు తీసుకుంటుంది**

**- జనసేన దక్షిణ పార్టీ పాయింట్ అఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి**




**విశాఖపట్నం, జూలై 10, జయ జయహే**

మాజీ కార్పోరేటర్ పీతల మర్తి యాదవ్ అధికారులపై చేస్తున్న ఆరోపణలకు జనసేన పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ దక్షిణ నియోజక వర్గ పాయింట్ అఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులపై చేస్తున్న ఆరోపణలుకు జనసేన పార్టీకి సంబంధం లేదని కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రహించాలన్నారు. పీతలు మూర్తి యాదవ్ కూడా ఇకపై చేపటటబోయే సమావేశాలను జనసేన పేరుతో గానీ, పవన్ కల్యాణ్ ఫోటో లేదా జనసేన బ్యానర్ సైతం వాడకూడదని సూచించారు. డాక్టర్ మ(రివేముల శ్రీనివాస్ మాట్లాడుతూ పీతల మూర్తి యాదవ్ ప్రభుత్వ అధికారులతో సమస్యలు ఉంటే అది పార్టీ అధిష్టానినికి తెలియచేయాలి తప్ప ఇలా ప్రెస్ మీట్లు పెట్టడం తగదన్నారు. ప్రభుత్వ అధికారులపై మాట్లాడిన తీరు కరెక్ట్ కాదని, అయన జనసేన పార్టీ బ్యానరు వాడకూడదని అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు జనసేన పార్టీకి సంబంధం లేదని తెలియచేసారు. గతంలో కూడా సొంత పార్టీ నేతలపై కూడా ఇలానే ప్రెస్ మీట్లు పెట్టారని, ఇటువంటి వారిపై పార్టీ అధిష్టానం తప్పకుండా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com